




epaper. aksharakalam. com

# అక్షర కలం

aksharakalam@gmail.com

తెలుగు దినపత్రిక








సంపుటి : 17 సంచిక : 287 | 29-11-2025 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00


## పంచాయితీ ఎన్నికలకు
# లైన్ క్లీయర్

- ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ
- తామే ఎన్నికలు నిర్వహించాలని..స్టే ఎలా విదిస్తాం
- పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

2 లో..

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది.






## అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వార్త 2లో

## కెసిఆర్ దొంగదీక్షలతో
# తెలంగాణ రాలే

- ఉనికి కోసం దీక్షాదివస్ పేరుతో డ్రామాలు
- సోనియా దయవల్లనే తెలంగాణ సాకారం
- ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి
- బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు
- మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్



వార్త 2లో



2


## యంగ్ ఇండియా స్కూల్స్ కాదు..
### పురుగలన్నం లేకుండా కాపాడండి

## ఉడుపితో అనుబంధం
# విడదీయరానిది

### లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ

ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణెళింద్ర తీర్థ స్వామిజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమునాకు కర్మభూమిగా పేర్కొన్నారు.



వార్త 2లో

## కామారెడ్డిలో కవిత
# రైల్వే రోకో

2

- బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్
- అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- కాళేశ్వరంతోనిజామాబాద్‌కు ఒరిగిందేమి లేదని వ్యాఖ్య
- నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి
- జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి
- కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత



## సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నాం

జనవరి 1న ఆయుధాలు వదిలి వస్తాం

ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖ



రాయపూర్, అక్షరకలం ప్రతినిధి

మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర- మధ్యప్రదేశ్- ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో లేఖను విడుదల చేశారు. జనవరి 1న ఆయుధాలను విడిచి లొంగిపోతామని అందులో పేర్కొన్నారు. ఒక్కొక్కరు బదులుగా అందరం ఒకేసారి లొంగిపోతామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న లొంగుబాటు, హిడ్మా ఎన్‌కౌంటర్‌తో పార్టీ బలహీనమైందని పేర్కొన్నారు. మిగతా వారు లొంగిపోవాలన్న కేంద్రం విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. 2026 జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమించుకుంటామన్నారు. ఆయుధాలు అప్పగించి ప్రభుత్వ పునరావాసాన్ని అంగీకరిస్తామని చెప్పారు. తమకు సహకరించే రాష్ట్రంలో లొంగిపోవడానికి సిద్ధమని పేర్కొన్నారు.

## జోగుగూడెంలో సర్పంచ్ పదవికి వేలం

20 లక్షలకు దక్కించుకున్న వ్యక్తి

ఆంజనేయ ఆలయానికి వినియోగిస్తామని వెల్లడి

ఖమ్మం

:తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సర్పంచి పదవి దక్కించుకోవడం కోసం పలువురు నేతలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. పలుచోట్ల వేలం పాటలు సాగుతున్నాయి. గ్రామపంచాయితీ అభివృద్ధి కోసం అంటూ గ్రామ పెద్దలు ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ క్రమంలోనే పలు చోట్ల ఆ పదవిని బహిరంగ వేలం వేస్తున్నారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం జోగుగూడెం పంచాయతీ సర్పంచి పదవికి బహిరంగ వేలం వేశారు. వేలంలో ఏడుగురు అభ్యర్థులు పోటీపడగా.. వారిలో అత్యధికంగా ఒకరు రూ.20లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి వేలంలో వచ్చిన నగదు ఖర్చు చేయనున్నట్టు గ్రామస్థులు తెలిపారు. ఈగ్రామంలో పోలింగ్ జరగనుంది.

# ఢిల్లీ కాలుష్యంపై ప్రణాళిక ఏదీ

## మోడీపై మరోమారు రాహుల్ విమర్శలు

### పార్లమెంటులో చర్చిస్తామని వెల్లడి

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం ముప్పు తిప్పలు పెడుతోంది. స్వచ్ఛమైన గాలి లేక నగర వాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి అయితే మరీ దయనీయంగా మారింది. అనేక ఆరోగ్య సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇక ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం వాతావరణం మరింత దారుణంగా తయారైంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఢిల్లీ వాసులు కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. ఢిల్లీలో జీవించలేక పోతున్నామని వాపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఢిల్లీలో అత్యవసర ఆరోగ్య పరిస్థితిని విధించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఢిల్లీ కాలుష్యంపై చర్చ జరగాల్సిందేనని కోరారు. నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకటే చెప్పారు. బిడ్డలు విషపూరిత గాలిని పీల్చుకుంటున్నారని. నీరసించి పోవడమే కాకుండా భయపడుతున్నారని చెప్పారు. ఆందోళనగా ఉంటున్నారని వాపోయారు. మోడీ జీ.. భారతదేశ పిల్లలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మీరెలా మౌనంగా ఉండగల్గుతున్నారు? మీ ప్రభుత్వానికి ఎందుకు అత్యవసర ప్రణాళిక లేదు. జవాబుదారీతనం లేదా? అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిని పరిష్కరించడానికి దేశానికి ఒక కార్యాచరణ ప్రణాళిక అవసరమన్నారు.



# పంచాయితీ ఎన్నికలకు లైన్ క్లీయర్

### ఈ దశలో స్టే విధించలేమని స్పష్టీకరణ

### తామే ఎన్నికలు నిర్వహించాలని..స్టే ఎలా విదిస్తాం

### పిటిషనర్‌ను ప్రశ్నించిన ధర్మాసనం

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలని కోరుకుంటున్నారా..? అని పిటీషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో- 46పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పినట్లు హైకోర్టు గుర్తు చేసింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ చెప్పుకొచ్చారు. అయితే, ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని మరోసారి స్పష్టం చేసింది. తామే ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం. అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. అందుకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సబ్ కేటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కులసంఘాలు ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాయి. అత్యంత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కేటాయించాలని పిటిషనర్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. బీసీలలో ఏబీసీడీ వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. ఎన్నికల పక్రియ మొదలైనందున ఈ దశలో స్టే విధించలేమని తేల్చి చెప్పింది. నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎందుకు సవాల్ చేస్తున్నారని ప్రశ్నించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

# అధికారాలను హరించేదిగా కేంద్ర విత్తన బిల్లు

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను హరించే విధంగా కేంద్ర విత్తన బిల్లు ఉందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన విత్తన ముసాయిదా బిల్లుపై మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు.. శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీలో సెంట్రల్ డ్రాఫ్ట్ సీడ్స్ బిల్లు-2025 రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుపై సర్టిఫికేషన్ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండాలని సూచించారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకపోతే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విత్తన ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పంపాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. జిల్లాల వారీగా రైతు సమావేశాలు నిర్వహించి సంబంధిత అధికారులు అభిప్రాయ సేకరణ చేయాలని ఆదేశించారు. పంట నష్ట పరిహారం విషయంలో విత్తన ముసాయిదా బిల్లులో స్పష్టత లేదని వ్యా ఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన కేంద్ర ముసాయిదా విత్తన బిల్లుపై అభ్యంతరాలు, సవరణలు గట్టిగానే తెలుపుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు.

# యంగ్ ఇండియా స్కూల్స్ కాదు..

### పురుగలన్నం లేకుండా కాపాడండి

### ఎక్స్ వేదికగా హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి 'పురుగులన్నం మాకు వద్దు' అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

### ఉనికి కోసం దీక్షాదివస్ పేరుతో డ్రామాలు

### సోనియా దయవల్లనే తెలంగాణ సాకారం

### ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల త్యాగాలు మరువలేనివి

### బిసి రిజర్వేషన్ల అంశం ముగియలేదు

### మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో



చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

### బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు డిమాండ్

### అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

### కాళేశ్వరంతోనిజామాబాద్‌కు ఒరిగిందేమీ లేదని వ్యాఖ్య

### నిజాం సాగర్ పూడికతీత పనులు వెంటనే చేపట్టాలి

### జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్ ఏర్పాటు చేయాలి

### కామారెడ్డి పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్

**కామారెడ్డి, అక్షరకలం ప్రతినిధి**

: కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ



రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# ఉడుపితో అనుబంధం విడదీయరానిది



### లక్ష కంఠ భగవద్గీత పఠనంలో మోడీ

**బెంగళూరు, అక్షరకలం ప్రతినిధి**

ఉడుపి రావడం తనకు చాలా ప్రత్యేకమైంది అని ప్రధాని మోడీ అన్నారు. కర్ణాటకలోని ఉడుపిలో మోడీ పర్యటించారు. అంతకముందు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపుల నుంచి ప్రజలు పూల వర్షం కురిపించారు. అనంతరం ఉడుపిలోని ప్రసిద్ధ శ్రీకృష్ణ మఠానికి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష కంఠ భగవద్గీత పఠనంలో పాల్గొన్నారు. జగద్గురు శ్రీ శ్రీ సుగుణెళింద్ర తీర్థ స్వామిజీ విశ్వగీత పర్యాయ.. ప్రధాని మోడీని సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ





మాట్లాడుతూ.. ఉడుపి జనసంఘ్, భారతీయ జనతా పార్టీకి సుపరిపాలన నమూనాకు కర్మభూమిగా పేర్కొన్నారు. 1968లో ఉడుపి ప్రజలు జనసంఘ్ నుంచి వీఎస్.ఆచార్యను మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఉడుపిలో కొత్త పాలనకు ప్రజలు పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, సన్యాసులు, పండితులు, వివిధ రంగాలకు చెందిన పౌరులతో భగవత్ గీతను ఏకగ్రీవంగా పారాయణం చేయించారు. ఇక ఈ కార్యక్రమానికి హాజరైన పిల్లలు దగ్గర నుంచి చిత్రాలను సేకరించాలని భద్రతా సిబ్బందిని, పోలీసు సిబ్బందిని మోడీ కోరారు.



# సిసిఐ నిబంధనల మార్పు

## రాష్ట్ర విజ్ఞప్తిపై స్పందించని కేంద్రం

**గుంటూరు,**

పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఇప్పటి వరకు సానుకూల స్పందన రాలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో రైతులకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే మిర్చి రైతులకు సాయం అందిస్తామని చెప్పిన కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదు. ధరలు తగ్గి ఒక్కో రైతు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. కానీ, ఇటీవల గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాత్రం రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకున్నామని గొప్పగా ప్రకటించారు. తాజాగా, రాష్ట్రంలో 11 మార్కెట్ కమిటీల పరిధిలో 64 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు ఎనిమిది లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. సిసిఐ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల నుంచి 90 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తిని కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, సిసిఐ నిబంధనల సడలింపునకు కేంద్రంతో చర్చలు వేగవంతం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యాప్ విధానం మార్చాలని, 12 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని కోరామని మంత్రి ప్రకటించినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు.

# థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసల నిషేధం

## అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక ప్రకటన

**వాషింగ్టన్**

అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధం సమీపంలో కాల్పుల ఘటన నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పేద దేశాల నుంచి అగ్రరాజ్యానికి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తామని ప్రకటించారు. దీనిపై ఇప్పటికే అమెరికా యంత్రాంగం చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. మరోవైపు, వలసదారులకు అన్నిరకాల ప్రభుత్వ సబ్సిడీలు, ఫెడరల్ బెనిఫిట్స్‌ను కూడా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికా సాంకేతికంగా ముందుకెళు



న్నప్పటికీ.. మన ఇమిగ్రేషన్ విధానం ఆ ప్రయోజనాలను, చాలామంది జీవన పరిస్థితులను దెబ్బతీస్తోంది. అందుకే.. అమెరికా వ్యవస్థ పూర్తిగా కోలుకునేందుకు వీలుగా.. థర్డ్ వరల్డ్ దేశాల నుంచి వలసలను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. జో బైడెన్ ఆటోపెన్‌తో సంతకం చేసిన లక్షల మంది అక్రమ అడ్మిషన్లను రద్దు చేయనున్నట్లు తెలిపారు. అమెరికాకు ఆస్తి కాని లేదా మన దేశాన్ని ప్రేమించని వ్యక్తులను ఇక్కడి నుంచి పంపించేస్తాం. అమెరికాయేతర పౌరులందరికీ ఫెడరల్ ప్రయోజనాలు, సబ్సిడీలను నిలిపివేస్తాం అని అన్నారు. దేశ ప్రశాంతతకు భంగం కలిగించే, మన భద్రతకు ముప్పుగా మారే వారిని బహిష్కరిస్తాం. తిరోగమన వలస విధానంతోనే ఈ లక్ష్యాలను సాధించగలం అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. శ్వేత సౌధానికి రెండు బ్లాకుల దూరంలో బుధవారం మధ్యాహ్నం అమెరికా కాలమానం ప్రకారం కాల్పులు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నేషనల్ గార్డ్‌కు చెందిన ఓ సభ్యురాలు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు గాయపడ్డారు. నిందితుడిని అఫ్గాన్‌కు చెందిన రెహ్మానుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. సీఐఏ మద్దతు ఉన్న అఫ్గాన్ ప్రత్యేక సైనిక విభాగంలో అతడు కొన్నాళ్లు పనిచేసి అమెరికాకు వలస వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ట్రంప్ వలసలపై తాజా నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు.. అఫ్గాన్‌తో సహా మరో 18 దేశాలకు చెందిన గ్రీన్ కార్డ్ హోల్డర్స్‌ను అధికారులు సమీక్షించనున్నారు. పేద, అభివృద్ధి అంతగా లేని దేశాలను థర్డ్ వరల్డ్ కంట్రీస్‌గా పిలిచేవారు. దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలోని అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వీటిని తక్కువ ఆదాయం కలిగిన దేశాలుగా పేర్కొంటున్నారు. దక్షిణ సూడాన్, సోమాలియా, నైగర్, బుర్కినా ఫాసో, బురుండి, అఎ÷-గానిస్థాన్, మడగాస్కర్, ఇథియోపియా, లైబీరియా, పాకిస్థాన్, సిరియా, ఉగాండా వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇప్పటికే అక్కడ నివాసం ఉంటున్న వారిని వెనక్కి పంపడం ఖాయమని తెలుస్తోంది.

# ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఎ దర్యాప్తు ముమ్మరం

## అల్-ఫలా విశ్వవిద్యాలయానికి డాక్టర్ షాహిన్ సీన్ రిక్రియేషన్‌తో మూలాలు గుర్తిచే యత్నం

**న్యూఢిల్లీ,**

దిల్లీ పేలుడు కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఎ దర్యాప్తు ముమ్మరం గా సాగుతోంది. అన్ని కోణాల్లో దర్యాప్తును విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఫరీదాబాద్ ఉగ్ర కుట్రలో భాగస్వామి అయిన డాక్టర్ షాహిన్ ను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సీన్ రీక్రియేషన్ కోసం నిందితులతో సంబంధమున్న అల్-ఫలా విశ్వవిద్యాలయానికి తీసుకువెళ్లారు. ఫరీదాబాద్ మాడ్యూల్ తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణల



నేపథ్యంలో ఎన్ఐఏ అధికారులు డాక్టర్ షాహిన్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. తామంతా కలిసి దాదాపు రెండేళ్ల నుంచి అమ్మోనియం నైట్రేట్ వంటి పేలుడు పదార్థాలను సేకరిస్తున్నట్లు ఆమె అంగీకరించింది. వీటిని ఉపయోగించి పాక్‌కు చెందిన జైషే ఉగ్ర సంస్థ కోసం దేశవ్యాప్తంగా దాడులు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపింది. గురువారం విచారణలో భాగంగా డాక్టర్ షాహిన్ తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ పేర్కొన్నట్లు అధికారులు వెల్లడించారు. అల్-ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశంలో వారి వివాహం జరిగినట్లు తెలిపాడన్నారు. ఉగ్రకుట్ర దర్యాప్తులో భాగంగా ఈ కేసులో అరెస్టు చేసిన ఏడుగురు నిందితులను లఖ్‌నవూ, కాన్పూర్, సహరన్‌పూర్, ఫరీదాబాద్, జమ్మూకశ్మీర్‌లకు తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు షాహిన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు ఇప్పటికే గుర్తించడంతో అల్-ఫలాలోని ఇతర మహిళా వైద్యులను కూడా ఆమె ప్రభావితం చేసి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. యూనివర్సిటీలో ఎవరైనా ఉగ్ర మద్దతుదారులు ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని.. వారిని గుర్తించడానికి నిఘా వర్గాలు పని చేస్తున్నాయన్నారు. అల్-ఫలాలో దర్యాప్తు తర్వాత తదుపరి విచారణ కోసం షాహిన్‌ను లఖ్‌నవూ, కాన్పూర్‌లకు తీసుకువెళ్లనున్నారు. అనుమానితులకు ఆయా ప్రదేశాల్లోని వ్యక్తులతో ఉన్న పరిచయాలు, ఎవరెవరు వారికి సహకరించారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌తో మరికొందరు వైద్యులకు కూడా సంబంధాలు ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఉగ్ర మాడ్యూల్ ఆసుపత్రులు, క్లినిక్‌ల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. సహాయం కోసం విద్యావంతులైన వ్యక్తులను నియమించుకుంటున్నట్లు గుర్తించామన్నారు.

# దేశీయ స్టాక్ మార్కెట్లలో సరికొత్త జోష్

**1022 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్**

**320 పాయింట్లకు పైగా పెరిగిన నిఫ్టీ**

**న్యూఢిల్లీ,**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం సరికొత్త రికార్డులకు అతి చేరువలో ముగిశాయి. అన్ని రంగాల్లోనూ కొనుగోళ్ల వెల్లువ వెల్లువెత్తడంతో సూచీలు అప్రతిహతంగా దూసుకెళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు, దేశీయ పెట్టుబడిదారుల నుంచి బలమైన మద్దతు లభించడంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ ఏకంగా 1,022.5 పాయింట్లు ఎగబాకి 85,609.51 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, నిఫ్టీ కూడా 320.5 పాయింట్లు లాభపడి 26,205.3 వద్ద ముగిసింది. ఇది మార్కెట్ చరిత్రలో ఒక కీలకమైన ఘట్టంగా నిలిచింది. నిఫ్టీ చరిత్రలో తొలిసారిగా 26,200 కీలక స్థాయిని దాటి ముగియడం మార్కెట్ సెంటిమెంట్‌కు మరింత బలాన్నిచ్చింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ చార్టులపై 'ఫుల్ బుల్లిష్ మరుబోజు క్యాండిల్' ఏర్పడింది. దీని అర్థం, ట్రేడింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు కొనుగోళ్ల ఆధిపత్యమే కొనసాగిందని, అమ్మకాల ఒత్తిడి దాదాపుగా కనిపించలేదని మార్కెట్ పరిశీలకులు వివరిస్తున్నారు. ఈ పరిణామం మార్కెట్లో బలమైన అప్‌ట్రెండ్ కొనసాగుతోందనడానికి స్పష్టమైన సంకేతమని వారు పేర్కొంటున్నారు. సెషన్ మొత్తంలో సూచీలు ఎక్కడా తగ్గకుండా పైపైకి కదలడం ఈ ధోరణిని ధ్రువపరుస్తోంది. మార్కెట్ విశ్లేషకుల అంచనా ప్రకారం, నిఫ్టీకి 26,000 పాయింట్ల వద్ద బలమైన మద్దతు లభిస్తోంది. ఈ స్థాయికి పైన సూచీ స్థిరంగా కొనసాగితే, రాబోయే సెషన్లలో తన ఆల్-టైమ్ గరిష్ఠాలైన 26,277%-%26,350 జోన్‌ను సవాలు చేసేందుకు సిద్ధంగా ఉందని వారు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత కొనుగోళ్ల జోరు కొనసాగితే ఈ లక్ష్యాలను అందుకోవడం కష్టం కాకపోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ర్యాలీలో అన్ని రంగాల షేర్లు పాలుపంచుకున్నాయి. సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ వంటి ప్రధాన షేర్లు టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అయితే, భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మాత్రమే నష్టాలతో ముగియడం గమనార్హం. రంగాలవారీగా చూస్తే, అన్ని సెక్టోరల్ సూచీలు లాభాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.06 శాతం వృద్ధితో ర్యాలీకి నాయకత్వం వహించింది. దీని తర్వాత నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ (1.75%), నిఫ్టీ ఎనర్జీ (1.74%) సూచీలు కూడా గణనీయంగా లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ కొనుగోళ్ల ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.27 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.36 శాతం చొప్పున పెరిగాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం, ఈ భారీ లాభాలకు పలు అంశాలు దోహదపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా పండుగ సీజన్ కావడంతో మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొంది. దీనిని 'శాంటా క్లాజ్ ర్యాలీ'గా పిలుస్తారు. ఈ గ్లోబల్ సానుకూల పవనాలకు తోడు, దేశీయంగా రిటైల్ ఇన్వెస్టర్లు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీగా పెట్టుబడులు రావడం మార్కెట్లకు ప్రధాన చోదక శక్తిగా నిలిచింది. అయితే, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల ప్రవాహం మాత్రం పరిమితంగానే ఉంది. మరోవైపు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరవచ్చనే ఆశలు కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయని, ఇది రాబోయే నూతన సంవత్సరానికి సానుకూల దృక్పథాన్ని కల్పిస్తోందని విశ్లేషకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగం

**చైనా మాటలు ఎన్నటికీ లెక్కచేయం**

**అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించింది**

**చైనా రెచ్చగొట్టే ప్రకటన మానుకోవాలి**

**చైనా ఇకనైనా తన తీరును మార్చుకోవాలి**

**భవిష్యత్తులో దీనికి పరిణామాలు తప్పవు**

**విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి వెల్లడి**

**న్యూఢిల్లీ,**

దాదాపు 5 ఏళ్ల తరువాత భారత్, చైనా మధ్య సంబంధాలు కుదట పడుతున్నాయని భావిస్తున్న తరుణంలో మరో వివాదం మొదలైంది. అరుణాచల్ ప్రదేశ్ గురించి చైనా చేసిన రెచ్చగొట్టే ప్రకటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చైనాకు సమాధానమిస్తూ.. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలో అంతర్భాగమని, విడదీయరాని భాగమని అన్నారు. చైనా చేసే ఏ ప్రకటన కూడా ఈ వాస్తవాన్ని మార్చలేదని స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కు చెందిన ఒక భారత పౌరుడిని ఏకపక్షంగా నిర్బంధించినందుకు సంబంధించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ చేసిన ప్రకటనలు చూశాం. ఆమెకు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్ ఉంది. షాంఘై అంతర్జాతీయ విమానాశ్రయం నుండి జపాన్‌కు తన తదుపరి ప్రయాణం చేయాల్సి ఉంది. నిర్బంధం సమస్యను చైనాతో గట్టిగా లేవనెత్తాం. అంతర్జాతీయ విమాన ప్రయాణాన్ని నియంత్రించే అనేక నిబంధనలను ఉల్లంఘించిన వారి చర్యపై చైనా అధికారులు ఇంకా మాకు క్లారిటీ ఇవ్వలేదు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. చైనా అధికారుల చర్యలు తమ దేశ నిబంధనలను కూడా ఉల్లంఘిస్తున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. అన్ని దేశాల పౌరులకు 24 గంటల వరకు వీసా రహిత ప్రయాణానికి అనుమతిస్తుంది. బ్రిటన్‌లో నివసిస్తున్న భారత పౌరురాలు పేమా వాంగ్‌జోమ్ థోంగ్‌డోక్ నవంబర్ 21న లండన్ నుండి జపాన్‌కు వెళుతున్నారు. ఆమె మూడు గంటల పాటు నిర్ణయించిన స్టాప్ ఒక పీడకలగా మారింది. ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆమె పాస్‌పోర్ట్‌ను అరుణాచల్ ప్రదేశ్ ఆమె జన్మస్థలం అని రాసి ఉండటం వల్ల చట్టవిరుద్ధమని ప్రకటించారని పేర్కొన్నారు. థోంగ్‌డోక్‌తో జరిగిన సంఘటన గురించి చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడారు. ఆమెపై ఎలాంటి నిర్బంధ చర్యలు, నిర్బంధం లేదా వేధింపులు జరగలేదని పేర్కొన్నారు. చైనా సరిహద్దు తనిఖీ అధికారులు చట్టాలు, నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలను పూర్తి చేశారు. సంబంధిత వ్యక్తి యొక్క చట్టపరమైన హక్కులు, ప్రయోజనాలను పూర్తిగా రక్షించారని తెలుసుకున్నాం" అన్నారు. థోంగ్‌డోక్‌తో చేసిన ప్రవర్తనపై భారతదేశం (అధికారిక దౌత్య నిరసన)పై చైనా మరోసారి రెచ్చగొట్టే ప్రకటన చేసింది. మావో నింగ్ అరుణాచల్ ప్రదేశ్‌పై చైనా వాదనలను కూడా ప్రస్తావించారు. చైనా వారు జాంగ్‌నాన్ లేదా దక్షిణ టిబెట్ అని ఆ ప్రాంతాన్ని పిలుస్తామని చెప్పారు. "జాంగ్‌నాన్ చైనాలో భాగం. భారతదేశం ద్వారా చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేసుకున్న అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా ఎప్పుడూ గుర్తించలేదు" మరోసారి చైనా కయ్యానికి కాలు దువ్వుతోంది. అయితే చైనా తీరును భారత ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. చైనా ఇకనైనా తన తీరును మార్చుకోవాలని, భవిష్యత్తులో దీనికి పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మాణం

**భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను మరువలేం**

**అమరావతిలో స్వామి ఆలయానికి చంద్రబాబు శంకుస్థాపన**

**రెండుదశల్లో రూ.260 కోట్లతో నిర్మిస్తామని ప్రకటన**

**అమరావతి,**

దేవతల రాజధాని అమరావతి అయితే... ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మనం నిర్మించుకుంటున్న రాజధాని అంతలా ఉంటుందని అన్నారు. అన్ని అడ్డంకులు అధిగమించి ముందుకు సాగుతున్నామని అన్నారు. రాజధానిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు సీఎం చంద్రబాబు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం ఓం నమో వేంకటేశాయ అంటూ సీఎం చంద్రబాబు ఉపన్యాసాన్ని ప్రారంభించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఈ యుగంలో ఏపీలో అవతరించారన్నారు. 2019లో ఆలయాన్ని నిర్మించాలని సంకల్పం చేశామని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి పేరు పెట్టినప్పుడే వేంకటేశ్వర స్వామి తన ద్వారా సంకల్పించారని తెలిపారు. ఇక్కడి రైతాంగం 29 వేల మంది 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందం గా ఇచ్చారని.. వారిని అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. వారికి ఆ సంకల్పాన్ని వేంకటేశ్వర స్వామి కల్పించారన్నారు. కృష్ణానది తీరాన పవిత్రమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మితమైందని తెలిపారు. 1983లో తిరుమలలో అన్నదానాన్ని ఎన్టీఆర్ ప్రారంభిస్తే.. 2003లో ప్రాణదానం కార్యక్రమాన్ని స్విమ్స్‌లో ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 'మా ఇంటి దైవం వేంకటేశ్వర స్వామి... మా ఇంటి నుంచి చూస్తే ఆయన నామాలు కనిపిస్తాయి' అని చెప్పుకొచ్చారు. ఎప్పుడూ కూడా వేంకటేశ్వర స్వామికి అప్రతిష్ట పాలు తెచ్చే పనిని చెయ్యనని.... ఎవరినీ చేయనివ్వనని స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి వద్దకు ఎప్పుడు వెళ్ళినా క్యూ లైన్‌లోనే వెళతానని తెలిపారు. ముఖ్యమంత్రిగా కాదు... భక్తుడిగా వెళతానని సీఎం అన్నారు. కొందరు తప్పులు చేస్తారని.. తప్పు చేసిన వారికి ఇంకో జన్మలో శిక్ష ఉంటుందను కుంటారని.. అయితే తప్పు చేస్తే మాత్రం వేంకటేశ్వర స్వామి ఈ జన్మలోనే శిక్షిస్తారన్నారు. గడచిన ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచి చేసిన పరిస్థితులు లేవని విమర్శించారు. ఐదేళ్లు ఇక్కడ రైతులకు నరకాన్ని చూపించారన్నారు. వేంకటేశ్వర స్వామిని రైతులు నమ్ముకున్నారని.. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు పాదయాత్ర చేసిన ఈ ప్రాంత రైతులను అభినందిస్తున్నట్లు తెలిపారు.

# మతం కంటే మానవత్వమే గొప్పది

## మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు

## ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

## మంగళగిరిలో మసీద్‌ను ప్రారంభించిన మంత్రి

అమరావతి,

మతం ఏదైనా మానవత్వాన్ని ఎన్నడూ మరవకూడదని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన సేవ అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. యువత భవిష్యత్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరిలోని ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన 'నూర్ మసీద్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మస్జిద్‌ను ప్రారంభించి, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. "మంగళగిరి ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం నాకు దక్కింది. నాకున్న శక్తి మేరకు సేవ చేస్తున్నాను. అదేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. సమాజంలో ఇంకా పేదరికం ఉంది, దానిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, "2019లో దేవుడు నాకు ఒక కఠినమైన పరీక్ష పెట్టాడు. చాలామంది నన్ను ఎగతాళి చేశారు. కానీ, అదే దేవుడు నాకు శక్తిని, పట్టుదలని ఇచ్చాడు. క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేస్తే విజయం తప్పక వరిస్తుంది. కష్టాలు అందరికీ వస్తాయి, వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి" అని యువతకు స్ఫూర్తినిచ్చారు. కాలం మారిందని, యువత చదువుపై దృష్టి సారించి భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. 2047 నాటికి దేశాన్ని అగ్రస్థానంలో నిలపాలన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా అందరూ పనిచేయాలని లోకేశ్ కోరారు. "మెరుగైన సమాజ నిర్మాణం కోసం నైతిక విలువలు చాలా అవసరం. ముఖ్యంగా మహిళలను గౌరవించాలి. మన మధ్య విభేదాలు సృష్టించడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు, అలాంటి వాటికి తావివ్వకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రజలు నా పనిని గుర్తించినప్పుడే నాకు కొండంత బలం. అందరికీ అండగా ఉంటూ, కలిసికట్టుగా రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ నేత పోతినేని శ్రీనివాసరావు, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, కమిటీ సభ్యులు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు !

మరో తుఫాన్ ద్వితాహ్ దూసుకుని వస్తోంది. అది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు.తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది.

రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌతోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపోతున్నామంటూ కేంద్ర బృందానికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశుసంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర



సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించాలి

**కావాలని రాజధానికి వ్యతిరేకంగా పోస్టులు**

**అమరావతి 29 గ్రామాల పరిధి సరిపోదు**

**దేవతల రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతా**

**అమరావతి రైతులతో భేటీలో సీఎం చంద్రబాబు**

**అమరావతి**

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం అమరావతి పర్యటన ఉన్నందున క్యాపిటల్ గెయిన్స్ మరో 2 ఏళ్లు పొడిగించేలా కేంద్రాన్ని కోరాలని రైతులు సీఎం చంద్రబాబును కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలంగా స్పందించారు. రాజధాని అమరావతి రైతులతో సచివాలయం 5వ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్?లో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సమావేశానికి 80 మంది రైతులు హాజరు అయ్యారు. రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్?లతో ప్రభుత్వం ఇప్పటికే త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ త్రిసభ్య కమిటీ 3 సార్లు భేటీ అయ్యింది. అయితే ఇప్పుడు ఈ రైతుల సమావేశంలో సమస్యల పరిష్కారంపై మరింత స్పష్టత వచ్చింది. రైతులకు ప్లాట్లు కేటాయింపు, జరీబు భూములు, ఎసైన్డ్ భూములకు సంబంధించి సమావేశంలో చర్చ జరిగింది. ఇంకా పరిష్కరించదగ్గ సమస్యలన్నింటినీ త్రిసభ్య కమిటీ పరిష్కరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే 29 గ్రామాల పరిధి సరిపోదని సీఎం చంద్రబాబు అన్నారు. అదే జరిగితే ఓ మున్సిపాలిటీగా మాత్రమే అమరావతి ఉంటుందని అన్నారు. అమరావతి పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే తాను తీసుకునే నిర్ణయాలకు రైతుల నుంచి కూడా మద్దతు కావాలని సీఎం చంద్రబాబు కోరారు.రాజధానికి భూములు ఇచ్చిన రైతులుగా మీపై అభిమానం, కృతజ్ఞత ఉన్నాయని తెలిపారు. రాజధానికి వ్యతిరేకంగా కొందరు కావాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని రైతులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అసత్య పోస్టులను కట్టడి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. అమరావతి ఉద్యమంలో భాగంగా అనేక జేఏసీలు వచ్చాయని, ఇప్పుడు రైతులంతా కలిసి అమరావతి డెవలప్?మెంట్ అసోసియేషన్ పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసుకోవాలని సీఎం రాజధాని రైతులకు సూచించారు. అమరావతి రైతుల అభివృద్ధికి, భవిష్యత్తుకు తాను పూర్తి కమిట్?మెంట్?తో ఉన్నానని అన్నారు.మీకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం వెల్లడించారు. రైతులు కూడా తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. రైతులు, జేఏసీ నేతలు సీఎం దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. బిల్డింగ్?కి ఫ్లోర్ పర్సంటేజ్ ఎస్?ఎఫ్?ఐ పెంచాలని రైతులు కోరారు. విజయవాడ, గుంటూరు కంటే అమరావతిలో తక్కువ ఉందని రైతులు సీఎం దృష్టికి తెచ్చారు. కరకట్ట బలోపేతం చేయాలని రైతులు చెప్పగా అది ప్రభుత్వం బాధ్యత అని సీఎం స్పష్టం చేశారు. బ్యాంకు లోన్ల కోసం వెళ్తే 30 సంవత్సరాల డాక్యుమెంట్?లు అడుగుతున్నారని రైతులు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో రాజధాని రైతులు సుదీర్ఘ పోరాటం చేశారు. వారికి ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి" అని పురపాలక, సీఆర్డీఏ శాఖలను ఆదేశించారు. రైతుల ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు త్వరలోనే వారితో సమావేశం కావాలని పురపాలక శాఖ మంత్రి నారాయణకు, ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వం కోసం త్యాగాలు చేసిన రైతులకు అదే స్థాయిలో సహకారం అందించడం మన బాధ్యత అని అన్నారు. ఇంకా ఏమైనా అపరిష్కృత అంశాలు మిగిలి ఉంటే, వాటిని కేబినెట్ సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.అలాగే, అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేందుకు స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. నిర్మాణాల వేగం, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అంతిమంగా అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పి. నారాయణతో పాటు సీఆర్డీఏ, పురపాలక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నలుదిశలా తిరుమల ఆధ్యాత్మిక వైభవాన్ని చాటాలి

**ప్రధాన ఆలయాల్లో తిరుమల తరహా విధానాలు**

**శ్రీవారి సేవకులుగా వైద్య నిపుణులు..**

**టీటీడీపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి,**

ప్రపంచం నలుచెరగులా తిరుమల శ్రీవారి ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్యాత్మికత, అన్నదానం, విద్య, వైద్యానికి చిరునామాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. గురువారం సచివాలయంలో దేవాదాయశాఖ, టీటీడీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుమల ఆలయంలో పాటిస్తున్న అత్యుత్తమ విధానాలను రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లోనూ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీ, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాల్లో తిరుమల ప్రమాణాలను అనుసరించాలని సూచించారు. ప్రసాదాల తయారీకి సేంద్రియ ఉత్పత్తులను మాత్రమే వినియోగించాలని, భక్తుల నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వాడుకోవాలని ఆదేశించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యం కావాలని, టీటీడీ భక్తుల పోర్టల్‌ను ఆర్టీజీఎస్‌తో అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు.తిరుపతిలోని స్విమ్స్, రుయా, బర్డ్ ఆస్పత్రులను అనుసంధానం చేసి, వాటిని ఒక మోడల్‌గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పుట్టపర్తి శ్రీ సత్యసాయి ఆస్పత్రుల తరహాలో అత్యుత్తమ నిర్వహణ ప్రమాణాలతో వీటిని తీర్చిదిద్దాలని సూచించారు. దేశంలోని ప్రముఖ వైద్య నిపుణులను 'శ్రీవారి సేవకులు'గా ఆహ్వానించి, వారి సేవలను ఈ ఆసుపత్రుల ద్వారా భక్తులకు, ప్రజలకు అందించేలా అవకాశం కల్పించాలన్నారు. మందులను నేరుగా తయారీదారుల నుంచే కొనుగోలు చేయాలని, అత్యవసర సమయాల్లో క్యూలైన్లలోని భక్తులను తక్షణమే ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు అన్ని సేవలను వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు.రాబోయే వైకుంఠ ఏకాదశికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎం టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులు అన్ని భాషల్లోనూ దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని, వీలైనంత ఎక్కువ మంది సామాన్య భక్తులకు దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. టీటీడీ ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లో నిత్యాన్నదానం జరిగేలా చూడాలన్నారు. తిరుమల కొండలపై జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, దివ్య ఔషధవనం ఏర్పాటుతో పాటు వివిధ రకాల పుష్పజాతుల మొక్కలను నాటాలని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించ తలపెట్టిన 5,000 దేవాలయాల డిజైన్లను మార్చి, వాటిలో ఆధ్యాత్మికత, ప్రశాంతత ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలను టీటీడీ పాలకమండలి సభ్యులతో కూడిన కమిటీ పర్యవేక్షించాలని సూచించారు. కొత్త ఆలయాలతో పాటు రాష్ట్రంలోని పురాతన దేవాలయాల జీర్ణోద్ధరణకు పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల్లో టీటీడీ ఆలయాల నిర్మాణం జరుగుతోందని అధికారులు సీఎంకు వివరించారు. అసోంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి 10 ఎకరాలు కేటాయించారని తెలుపగా, మరింత స్థలం కోసం తాను స్వయంగా మాట్లాడతానని సీఎం బదులిచ్చారు. దేశ, విదేశాల్లో నిర్మించే ప్రతి ఆలయం తిరుమల ప్రధాన ఆలయంతో అనుసంధానమై ఉండాలన్నారు. శ్రీవారి ఆస్తులు, ధనానికి పూర్తి జవాబుదారీతనం ఉండాలని, ఎక్కడా దుర్వినియోగానికి తావివ్వకుండా పారదర్శకంగా వ్యవహరించాలని గట్టిగా సూచించారు. ఒంటిమిట్ట రామాలయానికి భక్తుల సంఖ్య పెరిగేలా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. సామాన్య భక్తులకు దర్శన సమయం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం నిమిషానికి 8 మంది దర్శనం చేసుకుంటున్నారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. దర్శన టికెట్, కాటేజీ బుకింగ్‌ను ఒకేసారి అందించడం ద్వారా దళారుల బెడదను అరికట్టామన్నారు. లడ్డూ నాణ్యత పెంచడంతో పాటు అన్నప్రసాదంలో వడ కూడా అందిస్తున్నామని, వంటశాలలను ఆటోమేషన్ చేసి రోజుకు 2.75 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ప్రణాళిక చేస్తున్నామని వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వెంకయ్య చౌదరి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

# స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను

**అమరావతిలో శ్రీవారి**

**ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన**

**రూ.260 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి ప్రణాళిక**

**రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని**

**టీటీడీకి సీఎం ఆదేశం**

**అమరావతి,**

రాజధాని అమరావతిలోని వెంకటపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తిరుమల తరహాలో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రూ.260 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆలయ విస్తరణ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ బృహత్తర కార్యాన్ని రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ విస్తరణ పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. తొలి దశలో రూ.140 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, ఏడంతస్తుల మహారాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ వంటి నిర్మాణాలు చేపడతారు. ఇక రెండో దశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, భారీ అన్నదాన సముదాయం, యాత్రికుల విశ్రాంతి భవనాలు, అర్చకులు-సిబ్బంది నివాస గృహాలు, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, కలియుగ దైవం వేంకటేశ్వరుని ఆశీస్సులతోనే రాజధానికి అమరావతి అని పేరు పెట్టామని గుర్తు చేశారు. "దేవతల రాజధాని అమరావతే మన రాజధానిగా ఉండాలని సంకల్పించాం. కృష్ణానది ఒడ్డున 25 ఎకరాల్లో 2019లోనే ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాం. కానీ గత ప్రభుత్వం విధ్వంసం తప్ప ఒక్క మంచి పని కూడా చేయలేదు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాల భూమిని త్యాగం చేస్తే, వారికి గత ఐదేళ్లు నరకం చూపించారు. ఆ వెంకన్ననే నమ్ముకున్న రైతులు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరుతో పాదయాత్ర చేశారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని అన్నారు. తాను శ్రీవారికి పరమ భక్తుడినని, తమ ఇంటి దైవం ఆయనేనని చంద్రబాబు తెలిపారు. "మా ఇంటి నుంచి చూస్తే శేషాచల పర్వతం కనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి స్వామిని చూస్తూ పెరిగాను. స్వామికి అప్రతిష్ఠ తెచ్చే ఏ పనీ చేయను, ఎవరినీ చేయనివ్వను. తప్పు చేస్తే ఆయనే ఈ జన్మలో శిక్షిస్తాడు. నాడు స్వామివారి సేవకు వెళ్తుంటే నక్సలైట్లు 23 క్లైమోర్ మైన్లు పేల్చినా, ఆ స్వామి దయ వల్లే ప్రాణాలతో బయటపడ్డాను" అని నాటి ఘటనను గుర్తుచేసుకున్నారు. తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుడితే, తాను స్విమ్స్‌లో ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించానని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని చేపడతామని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేందుకు ప్రణాళికలు ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయాన్ని నిర్మిస్తోందని ఉదహరించారు. భక్తులు కూడా ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సంపదతో వర్ధిల్లాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, రైతులు, భక్తులు పాల్గొన్నారు.

# రైతులు ఎట్టిపరిస్థితులలో నష్టపోకూడదు..

**రెండు రోజుల్లో ధాన్యం బకాయిలు చెల్లించండి**

**అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,**

రాష్ట్రంలో ఏ రైతు కూడా పండించిన పంటకు నష్టపోకూడదని, పంటలకు ధరలు తగ్గకుండా, కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్ల బకాయిలను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో 50.75 లక్షల టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు గానూ రూ. 13,451 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ, "చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుని రెండు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేయాలి. భారీ వర్షాలు పడతాయన్న హెచ్చరికల నేపథ్యంలో రైతులకు తగినన్ని గోనె సంచులు అందించాలి," అని ఆదేశించారు.పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెచ్చిన కొత్త విధానాలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎంకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నుంచే కేంద్ర టెక్స్‌టైల్స్ కార్యదర్శి నీలం రావుకు ఫోన్ చేసి మాట్లాడారు. కొత్త నిబంధనల వల్ల రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వర్ష సూచన ఉన్నందున త్వరగా పరిష్కరించాలని కోరారు. పత్తి కొనుగోళ్ల సమస్యపై కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ఈ బాధ్యతలను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలుకు అప్పగించాలని అధికారులకు సూచించారు. అరటి, జొన్న ధరల సమస్యల పరిష్కారానికి స్థానిక వ్యాపారులు, ఎగుమతిదారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ రైతులను అప్రమత్తం చేయాలని స్పష్టం చేశారు.

# కృష్ణా జలాలపై హక్కును వదులుకునే ప్రశ్నే లేదు

**కేటాయింపులపై పునఃసమీక్షకు అంగీకరించేది లేదు**

**కేంద్రం ముందు బలమైన వాదనలు వినిపించాలి**

**అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం**

**జలవనరుల శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా**

కృష్ణా నదీ జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జలాల కేటాయింపులపై ట్రైబ్యునల్ చేపట్టిన పునఃసమీక్షను అంగీకరించబోమని ఆయన తేల్చిచెప్పారు. అమరావతిలో జలవనరుల శాఖ అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఈ అంశంపై కేంద్రం వద్ద రాష్ట్ర వాదనలను బలంగా వినిపించాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. అయితే, వరదల సమయంలో వచ్చే నీటిని మాత్రం సామరస్యపూర్వక వాతావరణంలో పంచుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది తెలుగు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

# మాక్ అసెంబ్లీతో కనువిప్పు కావాలి

**జగన్‌కు యనమల చురకలు**

**అమరావతి,**

విద్యార్థుల మాక్ అసెంబ్లీ జగన్‌కు కనువిప్పు కావాలని మాజీ స్పీకర్, టిడిపి నేత యనమల రామకృష్ణుడు అన్నారు. సభలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని యనమల రామకృష్ణుడు హితవు పలికారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక, శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కనీసం ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సభ వెలుపల మాట్లాడటం కంటే, ప్రజాప్రతినిధిగా సభలో హాజరై చర్చించడం ముఖ్యమని ఇప్పటికైనా తెలుసుకోవాలని సూచించారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి సభ నడిపిన విషయం తెలిసిందే.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# మైదానంలో నేను ఉంటే, కథ వేరేలా ఉంటది

## గౌహతి టెస్ట్‌పై కరుణ్ నాయర్

ఆగస్టులో ఇంగ్లండ్ పర్యటన నుంచి భారత జట్టుకు దూరంగా ఉన్న స్టార్ బ్యాటర్ కరుణ్ నాయర్, సోమవారం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. గౌహతిలో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికాపై భారత జట్టు కష్టాల్లో ఉన్న సమయంలోనే నాయర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. “కొన్ని పరిస్థితులు మనసుకు సుపరిచితమైన అనుభూతిని కలిగిస్తాయి %-% కానీ అక్కడ (మైదానంలో) లేకపోవడంలోని నిశ్శబ్దం బాధను మిగిలిస్తుంది,” అని రాసుకొచ్చాడు. 2016లో ఇంగ్లండ్‌పై ట్రిపుల్ సెంచరీ సాధించిన కరుణ్



నాయర్ కెరీర్ ఆ తర్వాత ఒడిదుడుకులతో సాగింది. అప్పటి నుంచి అతనికి అవకాశాలు చాలా తక్కువగా వచ్చాయి. అయితే ఇటీవల దేశవాళీ క్రికెట్‌లో ఆయన మంచి ఫామ్‌లో ఉన్నారు. శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమవడంతో, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే.. గిల్ స్థానంలో కరుణ్ నాయర్‌ను ఎంపిక చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. దేశవాళీ క్రికెట్‌లో పరుగులు సాధిస్తున్న నాయర్ వంటి రైట్ హ్యాండర్ ప్రస్తుతం జట్టుకు అవసరమని ఆయన పేర్కొన్నారు. గత సీజన్‌లో విదర్భ రంజీ ట్రోఫీ గెలవడంలో నాయర్ కీలక పాత్ర పోషించాడు. కానీ, ఇంగ్లండ్ టూర్‌లో 8 ఇన్నింగ్స్‌లలో కేవలం 25.62 సగటుతో 205 పరుగులు మాత్రమే చేయడంతో, సెలెక్టర్లు అతన్ని వెస్టిండీస్ సిరీస్‌తోపాటు ఇండియా-%గా% మ్యాచ్‌లకు ఎంపిక చేయలేదు. ఈ క్రమంలో జట్టు ఎంపికపై స్పందిస్తూ నాయర్ ఇటీవల ఓ ట్వీట్ చేశాడు. “ఇది కచ్చితంగా చాలా నిరాశజనకం. గత రెండేళ్లుగా నా ప్రదర్శనను బట్టి చూస్తే, నాకు ఇంకా మెరుగైన అవకాశాలు దక్కాల్సిందని భావిస్తున్నాను. జట్టులోని కొంతమంది వ్యక్తులు నాతో మాట్లాడారు, కానీ చివరికి నా పని పరుగులు చేయడమే” అంటూ చెప్పుకొచ్చాడు.

# నవంబర్ 30 న చరిత్ర సృష్టించనున్న కోహ్లీ-రోహిత్


భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. సౌతాఫ్రికాతో త్వరలో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌తో స్టార్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జోడీ ఒక అరుదైన చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు కలిసి 391 మ్యాచ్‌లు ఆడారు. ఇదే సంఖ్యలో క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ జోడీ కూడా మ్యాచ్‌లు ఆడారు. కాబట్టి నవంబర్ 30న సౌతాఫ్రికా పై తొలి వన్డే కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కలిసి మైదానంలోకి అడుగుపెడితే వారు సచిన్-ద్రవిడ్ రికార్డును అధిగమించి, భారతదేశం తరపున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన నంబర్ 1 జోడీగా చరిత్ర సృష్టించనున్నారు. ఈ వన్డే సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ ఆదివారం (నవంబర్ 23) స్క్వాడ్‌ను ప్రకటించింది. రెగ్యులర్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ అయిన కేఎల్ రాహుల్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. భారత గడ్డపై చాలా రోజుల తర్వాత రోహిత్-కోహ్లీ జోడీని చూడబోతున్నందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చివరిసారిగా వీరిద్దరూ స్వదేశంలో ఐపీఎల్ టోర్నమెంట్‌లో మాత్రమే కలిసి ఆడారు. రోహిత్-కోహ్లీ జోడీతో పాటు, సచిన్-ద్రవిడ్ (391), ద్రవిడ్-గంగూలీ (369), సచిన్-కుంబ్లే (367), సచిన్-గంగూలీ (341) జోడీలు కూడా అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అగ్రశ్రేణి భారత జోడీలలో ఉన్నాయి. భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లు రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో జరగనున్నాయి. మొదటి వన్డే నవంబర్ 30న రాంచీలో, రెండో వన్డే డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో, చివరి వన్డే



డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరగనుంది. వన్డే సిరీస్‌కు భారత స్క్వాడ్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిద్ కృష్ణ, ధ్రువ్ జురెల్, అర్షదీప్ సింగ్

# గంభీర్ పేరుతో సోషల్ మీడియాలో గందరగోళం

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేరుతో సైబర్ కేటుగాళ్లు సోషల్ మీడియాలో గందరగోళం సృష్టించారు. గంభీర్ పేరు, ఫోటోతో ఒక నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను సృష్టించి, అందులో ఆయన కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పోస్ట్ చేయడం క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. ఇటీవల భారత జట్టు ప్రదర్శనపై, ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల సమయంలో మిశ్రమ ఫలితాలు వస్తున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో గంభీర్ పేరుతో ఉన్న ఒక ఖాతా నుంచి ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. “భారత జట్టు కోచ్ బాధ్యతల నుంచి నేను తప్పుకుంటున్నాను. నాకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు” అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్ ఉంది. అచ్చం గంభీర్ అధికారిక ఖాతాను పోలిన విధంగా ప్రొఫైల్ పిక్చర్, బయో ఉండటంతో



చాలా మంది నెటిజన్లు, క్రికెట్ అభిమానులు ఇది నిజమే అని పొరపడ్డారు. దీంతో క్షణాల్లో ఆ పోస్ట్ వైరల్ అయ్యింది. జట్టు వరుస వైఫల్యాల కారణంగా గంభీర్ ఈ నిర్ణయం తీసుకున్నారని కొందరు అభిమానులు ఆవేదన వ్యక్తం చేయగా, మరికొందరు ఇది ఫేక్ న్యూస్ అని అనుమానం వ్యక్తం చేశారు. ఆ పోస్ట్ చేసిన ఖాతాను నిశితంగా పరిశీలించగా, అది గంభీర్ అధికారిక ఖాతా



కాదని తేలింది. గంభీర్ అధికారిక ఖాతాకు ఉండే ‘వెరిఫైడ్ టిక్’ లేకపోవడం, యూజర్ నేమ్‌లో చిన్నపాటి మార్పులు ఉండటాన్ని గమనించిన నెటిజన్లు.. ఇది సైబర్ కేటుగాళ్ల పనే అని నిర్ధారించారు. ఎవరో ఆకతాయిలు కావాలనే గందరగోళం సృష్టించడానికి ఈ పని చేశారని స్పష్టమైంది. ఇలాంటి సున్నితమైన సమయంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారి పేరుతో ఫేక్ న్యూస్ సృష్టించడంపై అభిమానులు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను గుడ్డిగా నమ్మవద్దని, అధికారిక ఖాతాల నుండి వచ్చే సమాచారాన్నే పరిగణలోకి తీసుకోవాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గంభీర్ తన కోచ్ బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు.

# స్మృతి పెళ్లి వాయిదా!?

టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పెళ్లి పెటాకులు అయిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఆదివారం బెంగళూరు వేదికగా జరగాల్సిన పెళ్లి మంధాన తండ్రి అనారోగ్యంతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. వివాహ వేడుకల్లో శ్రీనివాస్ మంధాన చాతి నొప్పికి గురవ్వడంతో అతన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి పెళ్లిని వాయిదా వేసారు. అంతేకాకుండా స్మృతి మంధాన కాబోయే భర్త పలాష్ ముచ్చల్ కూడా అస్వస్థతకు గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే తాజాగా మంధాన సోషల్ మీడియా ఖాతాల్లో పెళ్లికి సంబంధించిన వీడియోలను తొలగించడం చర్చనీయాంశమైంది. పెళ్లికి ముందు పలాష్ ముచ్చల్ ప్రపోజ్ చేసిన వీడియోతో పాటు సహచర క్రికెటర్లతో కలిసి చేసిన రీల్స్‌ను కూడా మంధాన తొలగించింది. ముఖ్యంగా తమ ఎంగేజ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ ఇటీవల స్మృతి మంధాన తన ఇన్‌స్టాలో ఓ వీడియోను షేర్ చేసింది. సహచర క్రికెటర్లతో కలిసి ‘సమజ్ హెూ హై గయా’ బాలీవుడ్ సాంగ్‌కు స్మృతి మంధాన డ్యాన్స్ చేసింది. ఈ సందర్భంగా తన వేలికి ఉన్న



ఎంగేజ్‌మెంట్ రింగ్ చూపించింది. ఇదే వీడియోను స్మృతి సహచర ప్లేయర్స్ జెమీమా, శ్రేయాంక పాటిల్ కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. తాజాగా వారు కూడా ఈ వీడియోను తొలగించడం అనేక సందేహాలకు తావిస్తోంది. అయితే ఈ వీడియోలను స్మృతి మంధాన డిలీట్ చేసిందా? హైడ్ చేసిందా? అన్నదానిపై క్లారిటీ లేదు. మరోవైపు పలాశ్ ముచ్చల్ ఇన్‌స్టా ఖాతాలో మాత్రం ప్రపోజల్ వీడియో అలానే ఉంది. భారత మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన నవీ ముంబై మైదానంలో పలాశ్ ముచ్చల్ ప్రపోజ్ చేసిన సంగతి తెలిసిందే. మంధాన ఖాతాలో పెళ్లికి సంబంధించిన వీడియోలు మాయమవడంతో అనేక ఊహగానాలు మొదలయ్యాయి. స్మృతి పెళ్లి పెటాకులు అయ్యిందా? అనే ప్రచారం మొదలైంది. పెళ్లికి ఆటంకాలు ఎదురవ్వడంతో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు తలెత్తాయా? ఈ ఆటంకాలను హెచ్చరికగా భావించి పెళ్లిని వాయిదా వేసుకున్నారా? అనే చర్చ జరుగుతోంది. మరికొందరు మాత్రం దిష్టి తగిలిందనే భావనతో స్మృతి మంధాన పెళ్లికి సంబంధించిన పోస్ట్‌లను తొలగించి ఉంటుందని కామెంట్ చేస్తున్నారు. తన తండ్రి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడంతో పెళ్లిని వాయిదా వేసుకోవాలని స్మృతి నిర్ణయించుకున్నట్లు ఆమె మేనేజర్ సోషల్ మీడియా వేదికగా తెలియజేశాడు. ఈ ఇద్దరూ 2019 నుంచి రిలేషన్‌లో ఉండగా.. గతేడాది అందరికి తెలిసింది.

# రొనాల్డో చిరస్మరణీయమైన గోల్

పురుషుల ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో ఒకరైన క్రిస్టియానో రొనాల్డో తన 40వ ఏట కూడా అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తూ అభిమానులను అలరిస్తున్నాడు. సౌదీ అరేబియాలోని ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ క్లబ్ అల్ నాసర్ తరఫున ఆడుతున్న క్రిస్టియానో రొనాల్డో.. సౌదీ ప్రో లీగ్ మ్యాచ్‌లో అల్ ఖలీజ్ జట్టుపై చిరస్మరణీయమైన గోల్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. రియాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అల్ నాసర్.. అల్ ఖలీజ్‌పై 4-1 తేడాతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయం సౌదీ ప్రో లీగ్ ఈ సీజన్లో అల్ నాసర్‌కు వరుసగా తొమ్మిదో విజయం కావడం విశేషం. క్రిస్టియానో రొనాల్డో ఆటకు వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపించాడు. మ్యాచ్ ముగింపు దశలో చూపిన విన్యాసం ఫుట్‌బాల్ చరిత్రలో నిలిచిపోతుంది. మ్యాచ్ దాదాపుగా ముగిసి అల్ నాసర్ విజయం ఖాయమైన తరుణంలో ఇంజరీ టైమ్‌లోని 90౦6వ నిమిషంలో క్రిస్టియానో రొనాల్డో తన అసాధారణమైన బైసైకిల్ కిక్‌తో గోల్ చేశాడు. బైసైకిల్ కిక్ లేదా ఓవర్‌హెడ్ కిక్ అనేది ఫుట్‌బాల్‌లో అత్యంత క్లిష్టమైన కిక్‌గా పరిగణించబడుతుంది. ఆటగాడు గోల్‌పోస్టుకు వెన్ను చూపి, గాలిలోకి వెనక్కి పడుతూ, తన కాళ్లను సైకిల్ పెడల్స్‌ను తొక్కే విధంగా గాల్లో వేగంగా తిప్పుతూ బంతిని గోల్ వైపు కొడతాడు. దీనికి ఎంతో ఫిట్‌నెస్ కావాల్సి ఉంటుంది. నవాఫ్ బౌషాల్ ఇచ్చిన క్రాస్‌ను అందుకున్న రొనాల్డో.. తన 40 ఏళ్ల వయస్సులో కూడా యువకుడిలా గాలిలోకి లేచి ఈ ఫీట్‌ను పూర్తి చేయడం అభిమానులకు పండుగలా అనిపించింది. ప్రేక్షకులు కళ్లార్పకుండా ఆ దృశ్యాన్ని వీక్షించారు. సౌదీ ప్రో లీగ్ ఈ సీజన్‌లో రొనాల్డోకు ఇది 10వ గోల్. అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో అతను అగ్రస్థానం కోసం పోటీ పడుతున్నాడు. తన కళాత్మక గోల్‌తో ఉప్పొంగిన రొనాల్డో.. ఈ అద్భుతమైన క్షణాన్ని తన అభిమానులతో పంచుకునేందుకు వీడియోను తన ‘ఎక్స్’ ఖాతాలో షేర్ చేశాడు. “ఉత్తమ శీర్షిక విజేతగా నిలుస్తుంది” అని పోస్ట్ చేసి, తన ఫాలోయర్‌లను ఈ గోల్‌కు సరిపోయే అద్భుతమైన శీర్షిక ఇవ్వమని కోరాడు. ఈ మ్యాచ్‌లో రొనాల్డో గోల్ చివరి మెరుపు మాత్రమే. అంతకుముందు జట్టు విజయం కోసం ఇతర కీలక ఆటగాళ్లు కృషి చేశారు. జోవో ఫెలిక్స్ 37వ నిమిషంలో అల్ నాసర్‌కు మొదటి గోల్‌ను అందించాడు. 42వ నిమిషంలో, బ్రెజిల్ యువ ఆటగాడు వెస్లీ మరో గోల్‌తో ఆధిక్యాన్ని పెంచాడు. అల్ ఖలీల్ తరఫున మురాద్ అల్ హవ్సావీ 47వ నిమిషంలో గోల్ చేసి కాస్త ఉత్సాహాన్నిచ్చినా.. 77వ నిమిషంలో స్టార్ ఆటగాడు సాదియో మానే చేసిన గోల్ అల్ నాసర్ విజయాన్ని ఖాయం చేసింది. సౌదీ ప్రో లీగ్ 2025-26 సీజన్‌లో అల్ నాసర్ అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. గతంలో 10 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన అల్ నాసర్ చివరిసారిగా 2018-19లో టైటిల్‌ను గెలుచుకుంది. గత మూడు సీజన్లలో రెండుసార్లు రెండో స్థానంలో నిలిచిన ఈ క్లబ్, ఈసారి రొనాల్డో సారథ్యంలో సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికి లీగ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# సూపర్ ఓవర్‌లో పాక్ విజయం!

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టీ20 టోర్నీలో పాకిస్థాన్ షాహీన్స్ టీమ్ విజేతగా నిలిచింది. ఆదివారం దోహా వేదికగా బంగ్లాదేశ్-ఏ జట్టుతో హెూరాహెూరీగా సాగిన ఫైనల్లో పాకిస్థాన్ షాహీన్స్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ షాహీన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 125 పరుగులే చేసింది. సాద్ మసూద్(26 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 38), అర్ఫత్ మిన్హాస్(23 బంతుల్లో 4 ఫోర్లతో 25), మాజ్ సదకత్(18 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 23) టాప్ స్కోరర్లుగా నిలిచారు. బంగ్లాదేశ్-ఏ బౌలర్లలో రిపన్ మోండల్(3/25) మూడు వికెట్లు తీయగా.. రకిబుల్ హసన్(2/16) రెండు వికెట్లు పడగొట్టాడు. మెహెరోబ్, జిషన్ అలామ్, అబ్దుల్ గఫ్ఫర్ సక్లెయిన్ తలో వికెట్ తీసారు. అనంతరం బంగ్లాదేశ్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేసింది. హబిబుర్ రెహ్మాన్ సోహన్(17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 26), రకిబుల్ హసన్(21 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. పాకిస్థాన్ షాహీన్స్ బౌలర్లలో సుఫియన్ ముఖీమ్(3/11)మూడు వికెట్లు తీయగా.. అర్ఫత్ మిన్హాస్(2/5), అహ్మాద్ దనియల్(2/11) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆఖరి ఓవర్‌లో బంగ్లాదేశ్ విజయానికి 7 పరుగులు అవసరం కాగా.. ఆ జట్టు కేవలం 6 పరుగులే చేసింది. పాక్ బౌలర్ అహ్మాద్ దనియల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. దాంతో సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో బంగ్లాదేశ్..3 బంతులే ఆడి 6 పరుగులే చేసి ఆలౌటైంది. సూపర్ ఓవర్ రూల్స్ ప్రకారం రెండు వికెట్లు పడితే ఆలౌటైనట్లు. మరోసారి అహ్మాద్ దనియల్ అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. అనంతరం పాకిస్థాన్ నాలుగు బంతుల్లో లక్ష్యాన్ని ఛేదించి మరో ఎమర్జింగ్ ఆసియాకప్ టైటిల్‌ను ముద్దాడింది. పాకిస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించిన అహ్మాద్ దనియాల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కగా.. మాజ్ సదఖత్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు వరించింది. భారత్-ఏతో సూపర్ ఓవర్‌లో విజయం సాధించిన బంగ్లాదేశ్-ఏ.. పాకిస్థాన్ షాహీన్స్‌తో మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయింది.

# కన్నీటి పర్యంతమైన రిషభ్ పంత్, గంభీర్!

టెస్ట్ క్రికెట్‌లో టీమిండియా మరో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. వరుసగా రెండో ఏడాది సొంతగడ్డపై క్లీన్ స్వీప్ అయ్యింది. సౌతాఫ్రికాతో బుధవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 408 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. 93 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే పరుగుల పరంగా టీమిండియాకు అతిపెద్ద ఘోర పరాజయం ఇది. దాంతో సౌతాఫ్రికా ఈ రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. 25 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్ట్ సిరీస్ విజయాన్నందుకుంది. 549 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 140 549 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా 27/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలింది. భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా(87 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో సిమన్ హర్మర్(6/37) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్(2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. మార్కో జాన్సెన్, సీనర్ ముత్తుసామి తలో వికెట్ తీసారు. టీమిండియా పరాజయం ఖాయమైన క్షణం తాత్కలిక కెప్టెన్ రిషభ్ పంత్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఉబికి వస్తున్న దు:ఖాన్ని రిషభ్ పంత్ ఆపుకునే ప్రయత్నం చేశాడు. కన్నీళ్లను తుడుచుకుంటూ కనిపించాడు. మరోవైపు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా తీవ్ర బాధలో కనిపించాడు. ఈ ఓటమిని ఈ ఇద్దరూ ఏ మాత్రం జీర్ణించుకోలేకపోయారు. ఈ ఇద్దరూ బాధపడుతూ ఉన్న ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో రిషభ్ పంత్ భావోద్వేగంగానే మాట్లాడాడు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోకపోవడంతోనే ఓటమిపాలయ్యామని చెప్పాడు. ఈ ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత మెరుగవుతామని తెలిపాడు. మరోవైపు గౌతమ్ గంభీర్ ఈ ఓటమికి తనతో సహా జట్టులోని ప్రతీ ఒక్కరు నిందలు పడాల్సిందేనని అభిప్రాయపడ్డాడు. హెడ్ కోచ్‌గా తన భవితవ్యాన్ని బీసీసీఐ నిర్ణయిస్తుందని చెప్పాడు. జట్టు కంటే ఎవరూ ఎక్కువ కాదని తాను తరుచూ చెబుతూ ఉంటానని గుర్తు చేశాడు. అయితే తన హయాంలోనే ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌తో పాటు ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా టెస్ట్ సిరీస్ సమం చేసుకుందని తెలిపాడు.

# హెూంగార్డ్ కిషన్ నాయక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత...



అక్షర కలం నాగార్జునసాగర్ ః

నాగార్జునసాగర్ విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ లో హెూంగార్డ్ గా విధులు నిర్వహిస్తున్న కిషన్ నాయక్ గత కొద్ది రోజుల క్రితం విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో మృతి చెందడం జరిగింది . కిషన్ నాయక్ కుటుంబానికి నాగార్జునసాగర్ సర్కిల్ పోలీస్ అధికారులు మరియు సిబ్బంది 91,500 రూపాయల ఆర్థిక సహాయం నాగార్జున సాగర్ సి.ఐ. శ్రీను నాయక్ , సాగర్ ఎస్.ఐ ముత్తయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది, హెూంగార్డులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతి రావు పూలే వర్ధంతి...



అక్షర కలం నాగార్జునసాగర్ ః

నాగార్జున సాగర్ నందికొండ మున్సిపాలిటీలోని కుల సంఘ నాయకుల ఆధ్వర్యంలో పైలాన్ కాలనీ జెన్కో దగ్గర జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు పేదవార్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు .ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ హీరేకార్ రమేష్ జి , ఎం ఆర్ పి ఎస్ నాయకులు ఆదాసు విక్రమ్ , ముడావత్ లక్ష్మణ్ నాయక్ , గడ్డమీది రవి ,పోలోజు శ్రీనివాసచారి , గోపియా నాయక్ , నవీన్ పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి.

## స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు




వలిగొండ నవంబర్ 28 అక్షరకలం

:గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిర్వహించాలని, యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏపీవో,పీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు.ఎన్నికల నిర్వహణ,ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వహించాలని, నిబంధనలపై నిర్వహిస్తున్న శిక్షణపై పూర్తి అవగాహనతో సూచించారు.అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.ఏ దశలోనూ అలసత్వానికి తావులేకుండా,ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పోలింగ్,కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని,ఏ చిన్న సమ స్యను రానివ్వకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలంధర్ రెడ్డి,తహసిల్దార్ దశరథ,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నెరద సర్పంచ్ అభ్యర్థి గా కాసోజు శంకరా చారి నామినేషన్

చిట్యాల : అక్షర కలం (నవంబర్ 28)

భారతీయ జనతా పార్టీ బలపరిచిన నేరడ గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాసోజు శంకరా చారి శుక్రవారం నామినేషన్ పత్రాలు సమర్పించారు. పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, పార్టీ శ్రేణులు తరలిరాగా రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారి బండ మధుసూదన్ రెడ్డికి నామినేషన్ పత్రాలు అందించారు. అంతకుముందు కాషాయజెండా రెపరెపలు, జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాల మధ్య భారీ జనసమూహంతో భారీ ర్యాలీ నిర్వహించారు. శాంభవీ మాత, శివాలయం, కాటమయ్య, రామాలయం చేరుకుని ఆ దేవాదిదేవతల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంజి గోవర్ధన్, చెరుపల్లి వేణు, మిర్యాల గోపాలకృష్ణ, కంభంపాటి వెంకన్న, డాక్టర్ చెరుపల్లి శ్రీనివాసులు, గ్రామశాఖ అధ్యక్షుడు వరికుప్పల నరసింహ, ఉపాధ్యక్షులు ఐతరాజు రమేశ్, వీరమల్ల శ్రీనివాస్, ఆవుల శ్రీనివాస్, ప్రిన్స్ రమేశ్, శ్రీరామోజు నరేశ్, వంశీ, మల్లేశ్, మిర్యాల వేణు, కర్నాటి వెంకటేశ్, సందీప్ రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తమ అభ్యర్థి విజయం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.



# ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు

. మాజీ జడ్పిటిసి ఎల్ హెచ్ పి హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్





అక్షర కలం, ఆమనగల్లు :

"ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు" అని మాజీ జడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ఎన్నికలలో పోట పోటికి పోవడం వల్ల బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడడమే తప్ప ప్రయోజనం ఏమీ లేదని ఓటర్లకు సూచించారు. తమ గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండేటటువంటి వ్యక్తిని అన్ని రకాలుగా తమకు సహకరించే వ్యక్తిని ఎన్నుకొని ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో వ్యక్తి తప్ప పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని తెలిపారు. గత ఎన్నికల్లో కడ్తాల్ మండలంలో ఐదు గ్రామపంచాయతీలో సర్పంచ్ మరియు వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేశామని ఈ ఎన్నికల్లో దాదాపుగా అదే మాదిరిగా గ్రామపంచాయతీలో సర్పంచ్ లను, వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేసుకొని అన్నదమ్ముల్లాగా ఒకే కుటుంబ సభ్యులు లాగా కలిసిమెలిసి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆయా తండాల నాయకులు, లంబాడ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు



నకిరేకల్ నియోజకవర్గం : అక్షర కలం, (నవంబర్ 28)

నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానము, లో శుక్రవారము రోజున 49 రోజుల తర్వాత హుండీ లెక్కింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయ హుండీ ఆదాయము రూ. 4,37,668 రూపాయలు మరియు గట్టు పైన స్వామివారి ఆలయ హుండీ నుండి 38,49,876 రూపాయల ఆదాయం వచ్చింది రెండు ఆలయాల్లో కలిపి మొత్తం 42,87,544 రూపాయలు వచ్చాయి. అన్నదానము కార్యక్రమం ద్వారా .42,374/- రూపాయలు తో పాటుగా అమెరికా డాలర్స్ 39. కెనెడ డాలర్స్ 5, శ్రీలంక రూపాయలు 10 వచ్చాయ ని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్. మోహన్ బాబు తెలియజేశారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీల కురాలు శ్రీమతి సుమతి, దుర్గ శివసాయి సేవా సంఘం సభ్యులు, విజయవాడ, ఐ.డి.బి.ఐ. బ్యాంకు, మాదవ ఎడవల్లి బ్రాంచి సిబ్బంది మరియు దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయం ఎస్పిటి మార్కెట్లో ఘనంగా పూలమాలతో నివాళులర్పించడం జరిగింది

నల్లగొండ అక్షర కలం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి గౌరవ సలహాదారులు చీరపంకజ్ యాదవ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే 1827 జన్మించి తాను బాల్య స్నేహితుడు బ్రాహ్మణ కుటుంబానికి చెందిన వారి వివాహానికి పోయిన తరువాత ఆ వేద బ్రాహ్మణులు ఇతన్ని చిన్న చూపు చూడడం కలిగింది ఈ సమాజంలో అంటరాని అస్పృశ్యత ఇతర కులాలకు మీద ఉన్నటువంటి ప్రభావం కలిగి ఈ సమాజాన్ని తీర్చిదిద్దాలని గొప్ప సంకల్పంతో తాను 13వ ఏట సావిత్రిబాయి పూలే తొమ్మిది వేట వివాహం చేసుకొని ఉన్నటువంటి ఆ రోజుల్లో పూర్తిగా స్త్రీలకు విద్య నిషేధించిన రోజుల్లో ఈ సమాజం నుంచి వెలుగులోకి తేవాలని స్త్రీలు విద్య లేనిది ఈ సమాజం మెరుగుపరచలేదని సౌహృదయంతో తన భార్య అయినటువంటి సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి 54 పాఠశాల నెలకొల్పి ఈ సమాజాన్ని తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు జ్యోతిరావు పూలే బాంబే నగరంలో లక్షలాదిమందిలో మహాత్మా అని బిరుదును అప్పుడున్నటువంటి బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది అంబేద్కర్ తన గురువు మాత్మ జ్యోతిరావు పూలే అని అతను రచించిన రచనలు చదివి గొప్పగా చెప్పినటువంటి నాయకుడు జ్యోతిరావు పూలే వారి ఆశయ సిద్ధాంతాల కోసం బహుజనులు మొత్తం ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ళ విజయకుమార్ జిల్లా కోశాధికారి చేర్పోతుల రమేష్ గౌడ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న యాదవ్ షణ్ముఖ చారి గడ్డం శంకరయ్య జిల్లా కార్యదర్శి లకటాపురం వెంకన్న బేతివెంకన్న పల్నాటి మోహన్ రాపోల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త లు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట అక్షర కలం

తుంగతుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తుంగతుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తుంగతుర్తి, గానుగబండ, తూర్పుగూడెం సర్పంచ్ లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమ్మిత్తం కొరకు ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని, మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు.ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నాపై అధి కారులను సంప్ర దించాలరు. తదుపరి మద్దిరాల ఎంపిడిఓ కార్యాలయంలో నామినేషన్ ఆన్లైన్ చేసే విధానాన్ని పరిశీలించారు. నామినేషన్ లను స్వీకరించిన తరువాత వెంటనే టి పోల్ యాప్ లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఆర్డీఓ వేణుమాధవ్,తహసీల్దార్ దయనందం ఎం పిడిఓ లు సత్యనారాయణ రెడ్డి,శేష్ కుమార్, ఆర్ ఓ లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం

## దళారులను నమ్మి రైతులు మోసోవద్దు

## 8.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

## వినియోగదారుల వ్యవహారా శాఖ మంత్రి నాదెండ్ల

అమరావతి

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. గురువారం విజయవాడలోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నేటి వరకు 8,22,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రైతుల ఖాతాల్లో రూ. 1,713 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 4 నుంచి 6 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని, రైతులు రూపాయి కూడా నష్టపోకుండా కల్లాల వద్దే ధాన్యం కొంటున్నామని స్పష్టం చేశారు. కొంతమంది నేతలు ధాన్యం కొనుగోళ్లపై అనవసరంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, రైతులు అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,674 కోట్ల బకాయిలు పెడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బకాయిలన్నింటినీ చెల్లించిందని గుర్తుచేశారు. ఈ సీజన్‌లో ఒక్క కృష్ణా జిల్లాలోనే లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం ఒక రికార్డు అని అన్నారు. గోదావరి జిల్లాల్లోనూ లక్ష టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు రేయింబవళ్లు కష్టపడుతుంటే, వారి మనోధైర్యం దెబ్బతినేలా కొందరు విమర్శలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వం 2022-23లో 3,33,155 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని రూ. 679.79 కోట్లు చెల్లిస్తే, తమ ప్రభుత్వం ఇప్పటికే అంతకు రెట్టింపు స్థాయిలో కొనుగోళ్లు జరిపిందని పోల్చి చెప్పారు. రవాణా వ్యవస్థను కూడా పటిష్టం చేశామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2023-24లో కేవలం 455 లారీలు నమోదు కాగా, తమ ప్రభుత్వంలో ఇప్పుడు 2,715 లారీలు నమోదు చేసుకున్నాయని వివరించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో రవాణా వాహనాల బకాయిలు రూ. 9 కోట్లు చెల్లించామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 7.53 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచామని, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో అదనంగా మరో లక్ష సంచులను సిద్ధం చేశామని చెప్పారు. వాతావరణ మార్పుల దృష్ట్యా రైతుల ఆందోళనను గమనించి మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియను ముందే ప్రారంభించామన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం 30వ తేదీ తర్వాత కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాల నుంచి పంటను కాపాడేందుకు కౌలు రైతులకు టార్పాలిన్ పట్టాలు సిద్ధంగా ఉంచామన్నారు. దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు ధాన్యం కొనే ప్రయత్నం చేస్తారని, ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ. 1792 మద్దతు ధర చెల్లిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ-క్రాప్‌లో నమోదైన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

# కో..అంటే కోకాపేట ..కోట్లల్లో ఎకరం..


## తాజాగా ఎకరం 151 కోట్లకు అమ్మకం

## నియోపోలీస్ ప్లాట్ల వేలంలో రికార్డుస్థాయి ధరలు

హైదరాబాద్,

భూమిలో బంగారం పండుతుందని అంటుంటారు. కానీ భూములు బంగారమయ్యాయని ఇప్పుడు నిరూపితం అయ్యింది. హైదరాబాద్ లో భూముల విలువ బంగారాన్ని మించి పెరిగిపోయి రికార్డు సృష్టిస్తున్నాయి. కోకాపేట్ పరిసర ప్రాంతాల్లో కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన ఈ వేలంలో కోకాపేట నియోపోలీస్ భూములు రికార్డు స్థాయి ధర పలికాయి. రెండో విడత వేలంలో ఎకరాకు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా.. 151 కోట్ల రూపాయలు పలికి హెచ్ఎండిఎకు కోట్లు కురిపించాయి. రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం కోకాపేటలో భూములు.. కో అంటే కోట్లు పలుకుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో కోకాపేటలోని నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈ-వేలంలో ఎకరం రూ.151.25 కోట్ల రికార్డు ధర పలికింది. నియోపోలిస్‌లోని ప్లాట్ నంబర్ 15, 16లోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా.. రూ.1,353 కోట్లు ఆదాయం లభించింది. హైదరాబాద్ కోకాపేట్ లో ఉన్న భూముల రెండో విడత ఈ-వేలం శుక్రవారం ముగిసింది. నియోపోలిస్ దగ్గర ఉన్న ప్లాట్ నెంబర్ 15 లో ఎకరానికి 151 కోట్ల 25 లక్షలు పలికిన ఎకరం ధర పలికి రికార్డు సృష్టించింది. అదే విధంగా ప్లాట్ నెంబర్ 16 లో ఎకరం ధర 147 కోట్ల 75 లక్షలు పలికింది.రెండో విడత వేలంలో భాగంగా 9.06 ఎకరాల భూమిని వేలం వేసిన ఊఓఆం .. 1,3 కోట్ల 52 లక్షల ఆదాయాన్ని పొందింది. ఎ÷-లాట్ నెంబర్ 15 లో 4.03 ఎకరాలకు గాను 609 కోట్ల 55 లక్షలు పొందినట్లు ఊఓఆం అధికారులు తెలిపారు. అదే విధంగా ఎ÷-లాట్ నెంబర్ 16 లో 5.03 ఎకరాలకు గాను 743 కోట్లు పొందినట్లు పేర్కొన్నారు. నవంబర్ 25న జరిగిన మొదటి విడత వేలంలో రికార్డు స్థాయిలో ఎకరానికి 137.25 కోట్లు పలికిన సంగతి తెలిసిందే.. కోకాపేట నియోపోలిస్ లో 29 ఎకరాలతో పాటు మూసాపేట దగ్గర ఉన్న 16 ఎకరాల భూములకు వేలం వేసేందుకు సిద్ధమైంది హెచ్ఎండీఏ.డిసెంబర్ 3, 5 తేదీల్లో మిగతా ఎ÷-లాట్లకు ఈ వేలం జరగనుంది. కోకాపేట్ నియోపోలీస్ ప్లాట్లకు ఎకరానికి 99 కోట్లు, కోకాపేట గోల్డెన్ మైల్ ప్లాట్లకు 70 కోట్లు, మూసాపేట్ ప్లాట్ల కు 75 కోట్ల చొప్పున ప్రారంభ ధరను నిర్ణయించింది హెచ్ఎండీఏ. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేసే వారికి ఆకాశమే హద్దుగా ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునేందుకు అనుమతులు ఇస్తారు. ఈ లేఅవుట్‌లో అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దాదాపు 300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక





# ఫ్యాన్స్‌కు బాలయ్య 'డబుల్' ట్రీట్..

బాలకృష్ణ ప్రస్తుతం హిట్ కాంబినేషన్ ను రిపీట్ చేస్తున్నాడు. తనకు ఇప్పటికే తనకు సింహా, లెజెండ్, అఖండ వంటి హిట్స్ ఇచ్చిన దర్శకుడు బోయపాటి శ్రీనుతో నాల్గోసారి 'అఖండ 2 తాండవం' సినిమాతో పలకరించబోతున్నాడు. ఈ సినిమా డిసెంబర్ 5న ప్యాన్ ఇండియా లెవల్లో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ, భోజ్ పురి, అవధ్ భాషల్లో విడుదల కాబోతుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ అఖండ 2 తాండవం పై అంచనాలు పెంచేశాయి. ఈ సినిమా తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీలో భారీ బిజినెస్ చేసినట్టు సమాచారం. అంతేకాదు బాలకృష్ణ కెరీర్ లో తొలి ప్యాన్ ఇండియా చిత్రం ఇదే కావడం గమనార్హం. ఓ హీరో సినిమా 65 యేళ్ల వయసులో ప్యాన్ ఇండియా లెవల్లో విడుదల కావడం అనేది మాములు విషయం కాదు. రజనీకాంత్, కమల్ హాసన్, చిరంజీవి, మోహన్ లాల్ తర్వాత ఈ ఏజ్ లో ప్యాన్ ఇండియా వ్యాప్తంగా తన సినిమాను విడుదల చేసిన సీనియర్ హీరోగా బాలయ్య రికార్డులకు ఎక్కాడు. తాజాగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చేస్తోన్న చిత్రంలో చారిత్రక పాత్రలో కనువిందు చేయబోతున్నాడు. ఈ మూవీలో బాలకృష్ణ మరోసారి డ్యూయల్ రోల్లో చేయబోతున్నట్టు తెలుస్తుంది. ఇద్దరు రాజులు కత్తితో పట్టుకున్న ఫోటో ను విడుదల చేశారు. వీరసింహారెడ్డి తర్వాత మరోసారి గోపీచంద్ మలినేనితో మరోసారి డ్యూయల్ రోల్ ఫార్ములాతోనే ఆడియన్స్ ముందుకు రాబోతున్నాడు. ఇక బాలయ్య, బోయపాటి శ్రీను విషయానికొస్తే.. వీళ్ల కాంబినేషన్ లో వచ్చిన అన్ని సినిమాల్లో బాలకృష్ణ డ్యూయల్ రోల్స్ చేయడం విశేషం. తాజాగా గోపీచంద్ మలినేని .. బాలకృష్ణ తో చేయబోతున్నది చారిత్రక నేపథ్యమున్న సినిమా. ఈ సినిమా పూజా కార్యక్రమానికి ఏపీ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరై స్క్రిప్ట్ ను నిర్మాతలకు అందజేశారు. బి.గోపాల్ తొలి షాట్ కు క్లాప్ కొట్టారు. బాలయ్య చిన్న కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫస్ట్ షాట్ కు బాబీ, బోయపాటి శ్రీను, బుచ్చిబాబు సమిష్టిగా డైరెక్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి స్టార్ దర్శకులు, అనేక మంది నిర్మాతలు హాజరయ్యారు.




# చిన్న సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది



అఖిల్ రాజ్, తేజస్వినీ ప్రధాన జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలైన వెంటనే ప్రేక్షకుల ప్రేమను సంపాదించి, థియేటర్లలో విజయవంతంగా దూసుకుపోతోంది. హృదయాన్ని హత్తుకునే ప్రేమకథగా విమర్శకులు, ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు అందుకుంటోంది. మొదటి రోజు నుంచే మంచి ఓపెనింగ్స్ నమోదవడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దృఢమైన స్థాయి సాధించింది. తాజాగా బయటకు వచ్చిన వసూళ్ల సమాచారం ప్రకారం, ఈ సినిమా మొదటి మూడ్రోజుల్లో రూ. 7.28 కోట్లు గ్రాస్ రాబట్టింది. ప్రత్యేకత ఏమిటంటే రోజు రోజుకు కలెక్షన్లు పెరుగుతూ వస్తుండటం. తొలి రోజు కంటే రెండో రోజు, రెండో రోజు కంటే మూడో రోజు కలెక్షన్లు మరింత మెరుగ్గా రావడం చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. నందిపాటి, బన్నీ వాస్ భారీగా థియేటర్లలో విడుదల చేశారు. అనిత చౌదరి, కవిత శ్రీరంగం తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.



# రామ్‌ను లవ్ యూ అనేసిన భాగ్యశ్రీ



ఇక రెండ్రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రా కింగ్ తాలూకా మ్యూజిక్ కాన్సర్ట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. రామ్‌పై ప్రశంసల వర్షం కురిపించింది. మీరు కింగ్ ఆఫ్ హార్ట్స్... ఐ లవ్ యూ అంటూ అందరిముందు ఓపెన్ అయ్యింది. దాంతో భాగ్యశ్రీ – రామ్‌ల మధ్య ఏదో జరుగుతుందని జనాలు ఫిక్స్ అయ్యారు. ఇంత జరుగుతున్నా రామ్ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం కూడా అనేక అనుమానాలకు తావిచ్చింది. తాజాగా భాగ్యశ్రీ భోర్సేతో ప్రేమాయణంపై రామ్ పోతినేని స్పందించారు. ఆంధ్రా కింగ్ తాలూకా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఛానెల్‌తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 16 ఏళ్లకే కెరీర్ ప్రారంభించారు, చాలామంది హీరోయిన్స్‌తో వర్క్ చేశారు. ఇప్పటి వరకు మీ గురించి ఒక్క రూమర్ లేదు.. కానీ ఈ ఫిల్మ్‌కు ఎందుకో రూమర్స్ బయటికొచ్చాయని ఓ విలేకరి ప్రశ్నించారు. దీనికి రామ్ స్పందిస్తూ.. ఈ సినిమాకు పాట రాసినప్పటి నుంచి ఇది స్టార్ట్ అయ్యింది. లేకపోతే ఎందుకు స్టార్ట్ అవుతుంది. ఇప్పటి వరకు పాట రాయలేదు, ఫస్ట్ టైం పాట రాశా. ఈ సాంగ్ రాసేసరికి హీరోయిన్ ఎంపిక కూడా జరగలేదని రామ్ తెలిపారు. దాంతో భాగ్యశ్రీ భోర్సేతో తాను డేటింగ్ చేస్తున్నట్లుగా వస్తున్న ఊహాగానాలకు రామ్ పోతినేని చెక్ పెట్టినట్లయ్యింది. కాగా కెరీర్‌లో చాలా మంది హీరోయిన్లతో వర్క్ చేసినప్పటికీ రామ్ గురించి పెద్దగా ఎలాంటి రూమర్స్ రాలేదు. అలాంటిది భాగ్యశ్రీ భోర్సేతో ఆయన డేటింగ్ చేస్తున్నాడంటూ వార్తలు రావడం టాలీవుడ్‌లో చర్చనీయాంశమైంది.

# ఆన్‌లైన్ వేధింపులపై సమంత పోరాటం



ప్రముఖ నటి సమంత, మహిళలపై ఆన్‌లైన్‌లో పెరుగుతున్న వేధింపులను ఎదుర్కోవడానికి ముందుకు వచ్చారు. ఈ లక్ష్యంతో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేస్తున్న 'యూఎన్ విమెన్ ఇండియా'తో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. మహిళలపై డిజిటల్ ప్రపంచంలో జరుగుతున్న హింసను నివారించేందుకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకూ జరుగనున్న 16 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో తాను పాల్గొంటున్నట్లు సమంత ఇప్పటికే తెలియజేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా ద్వారా తన 37 మిలియన్ల అనుచరులను ఉద్దేశించి మాట్లాడిన ఆమె, ఆన్‌లైన్ వేధింపులపై తన అనుభవాలను వెల్లడించారు. "సోషల్ మీడియాలో అసభ్య వ్యాఖ్యలు, బెదిరింపులు, డీప్ ఫేక్ చిత్రాలు వంటి అనేక రూపాల్లో మహిళలు దాడులకు గురవుతున్నారు. గతంలో ప్రత్యక్షంగా జరిగే ఈ వేధింపులు ఇప్పుడు డిజిటల్ ప్రపంచానికి మారాయి. ఇవి మనసును దెబ్బతీసేలా, ఆత్మవిశ్వాసాన్ని తగ్గించేలా ఉంటాయి," అని సమంత భావోద్వేగంతో తెలిపారు. తాను కూడా ఇలాంటి పరిస్థితులను పలుమార్లు ఎదుర్కొన్నానని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మహిళల్లో ఆన్‌లైన్ హింసపై అవగాహన పెంపొందించడం అని సమంత వివరించారు.



# ఆస్కార్ రేసులో మహావతార్ నరసింహా..!

సినీ ప్రపంచంలో సంచలనాన్ని రేపిన యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహా' విడుదలైన సమయంలో,భారత్‌లో యానిమేషన్ సినిమాలు పెద్దగా ఆదరణ పొందవని భావన ఉండేది. అయితే ఆ అంచనాలను పూర్తిగా తారుమారు చేస్తూ ఈ చిత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది. అశ్విన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని హెూంబలే సంస్థ సుమారు రూ.40 కోట్ల బడ్జెట్‌తో నిర్మించింది. థియేటర్లకు వచ్చిన వెంటనే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా, దేశవ్యాప్తంగా భారీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. దీర్ఘకాలిక ప్రదర్శనలో రూ.325 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అనేక రికార్డులను తిరగరాసింది.




# ఎన్టీఆర్ సినిమా టైటిల్ డ్రాగన్ కాదా?

టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ – 'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో తెరకెక్కుతున్న సినిమా 'డ్రాగన్ '. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ పాన్–ఇండియా మూవీపై సినీ వర్గాల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో 'కాంతార' బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఫస్ట్ లుక్‌లు అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేరాయి.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 28:**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య తో కలిసి జిల్లా గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో గ్రామీణ అభివృద్ధి సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఐకెపి, డిసిఎంఎస్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన 2025-26 వానకాలం వరి ధాన్యం కొనుగోలు



ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలని సమకూర్చాలని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యం, రైతుల వివరాలను ట్యాబ్ లలో నమోదు చేయాలని, మద్దతు ధర ప్రకారం సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను ప్రతి రోజు సందర్శించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్, మెప్మా పిడి, డిసిఎంఎస్ మేనేజర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి



**అక్షర కలం, మందమర్రి నవంబర్ 28:**

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ జయశంకర్ చౌరస్తాలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విహెచ్పిఎస్ జాతీయ నాయకుడు, బిసి కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సోత్కు సుదర్శన్ లు ముఖ్య అతిధులుగా హాజరై, ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం విహెచ్పిఎస్ జాతీయ నాయకుడు, బిసి కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సంఘసంస్కర్త అని, సమాజంలో కుల వివక్షత ఉండకూడదని, అసమానతలు తొలగిపోయి, మనుషులంతా సమానంగా జీవించాలని తెలియజేశారని తెలిపారు. మొట్టమొదటిసారి ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే కి విద్యాభ్యాసం నేర్పించి, స్త్రీలు చదువుకోవాలని పాఠశాలను ఏర్పాటు చేశారని, సత్యశోధక్ సంస్థను స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. పూలే స్ఫూర్తితో బహుజన వర్గాల ప్రజలు చదువుకొని, విద్యావంతులై, మంచి అభ్యున్నతి సాధించాలని, అంతిమంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల ప్రజలు రాజ్యాధికార వైపు ప్రయాణం చేసి, రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, బిసి సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ప్రతాప్, బైరాజు శ్రీనివాస్, కడారి జీవన్ కుమార్, ఆంజనేయ గౌడ్, దుర్గయ్య, బండి శంకర్ గౌడ్, చంద్రమౌళి, శ్రీనివాస్, దుర్శట్టి రాములు, భాస్కర్, గోపాల్, మురళీ గౌడ్, రాజా గౌడ్, కళ్యాణ్, ఆటో యూనియన్ నాయకులు రాజేశం, శ్రీనివాస్, రాములు, శ్రీనివాస్, లక్ష్మణ్, రవి, అంజన్న లు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 28:**

రాష్ట్రంలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అదనపు ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, నోడల్ అధికారి శంకర్ లతో కలిసి రెండవ విడత, మూడవ విడత రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల నిర్వహణ, నామినేషన్ ప్రక్రియపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయితీ ఎన్నికల ప్రకటన విడుదల అయినందున తదనగుణంగా ఎన్నికల నిర్వహణలో అధికారులకు అవసరమైన శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రస్తుతం మొదటి విడత నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితాను పూర్తి వివరాలతో రూపొందించాలని, ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సామాగ్రి జిల్లాలో అందుబాటులో ఉందని, అవసరం మేరకు వినియోగించుకోవాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నామినేషన్ల పరిశీలన, ఓట్ల లెక్కింపు అంశాలలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియ



నిర్వహణలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా శిక్షణ సమయంలో నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల కోడ్ను అధిగమిస్తే వెంటనే సమాచారము ఇవ్వండి. - జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 28)**



గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ 25.11.2025 తేదీన ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిందనీ ఆ తేదీ నుండి నారాయణపేట జిల్లాలోని అన్నీ గ్రామ పంచాయితీల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) అమల్లోకి వచ్చిందనీ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. అందువల్ల, జిల్లాలోని ఏ గ్రామ పంచాయితీ పరిధిలోనైనా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన (వెలివేషన్) జరిగితే, దయచేసి జిల్లా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగలరు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: (08506-283122) జిల్లా కలెక్టర్ మరియు - జిల్లా ఎన్నికల అథారిటీ, నారాయణపేట జిల్లా.

## నేడు నారాయణపేటలో దివ్యాంగులకు ఆటల పోటీలు

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 28)**

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 29న (శనివారం) ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లాకు చెందిన దివ్యాంగులకు జూనియర్, సీనియర్ విభాగాలలో జిల్లా స్థాయి ఆటల పోటీల( క్యారమ్స్, చెస్, షాట్ పుట్, రన్నింగ్)ను నిర్వహిస్తున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జిల్లా సంక్షేమ అధికారి సంచిత్ గంగ్వర్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని హైదరాబాద్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. నేటి ఈ జిల్లా స్థాయి ఆటల పోటీలకు దివ్యాంగులు ( శారీరక, అంధ, బధిర), దివ్యాంగుల కోసం పని చేసే స్వచ్ఛంద సంస్థలు, దివ్యాంగుల సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పునరావసం కల్పించాలి

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.

**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్,28)**


ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పునరవాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి "మాతృత్వం ఒక వరం - అందుకు దత్తత మరో మార్గం" కు సంబందించిన వాల్ పోస్టర్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా ప్రతి సంవత్సరం నవంబర్ నెలను దత్తత తీసుకున్న నెలగా జరుపుకోవడం జరుగుతదని అలాగే ఈ సంవత్సరం కూడా జరుపుకుంటారని తెలిపారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏటా థీమ్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంస్థాగతంగా లేని వారికి పునరావాసం కల్పించడమే ఉదేశ్యం అని ఆమె చెప్పారు. ప్రతి బిడ్డ ఇనీట్యూషన్ లోనే మగ్గి పోకుండా వారిని దత్తత ఇవ్వాలని, పిల్లలను అక్రమంగా కొనడం కానీ, అమ్మడం కానీ చేయకుండా చట్ట ప్రకారంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలు పుట్టిన తర్వాత వద్దు అనుకునే వాళ్ళు మహిళా శిశు సంఘక్షే శాఖ కార్యాలయాన్ని



సంప్రదించి తమ పిల్లలను అప్పగించాలని సూచించారు. ఈ ఏడాది ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంస్థాగత పునరావాసం అనే థీమ్తో ఈ ప్రచారం జరుగుతుందని, దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రత్యేక అవసరాలు గల పిల్లలను దత్తత తీసుకోవడాన్ని ప్రోత్సహించడం, దత్తత గురించి ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించడం, దత్తత ద్వారా పిల్లలు, కుటుంబాలకు కలిగే సంతోషాన్ని చాటడమే అని వివరించారు. బాలల న్యాయ (బాలల రక్షణ మరియు సంరక్షణ) చట్టం, 2015 ప్రకారం చట్ట విరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చినా.. తీసుకున్నా.. వారికి 3 సంవత్సరాల కారాగార శిక్ష, లక్ష రుపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఏ ప్రయోజనం కోసం అయినా ఒక బాలుడు/బాలికను అమ్మడం కానీ కొనడం గానీ జరిగితే వారికి ఐదేళ్ళ వరకు కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వమే కోర్టు ద్వారా చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతే కాకుండా వైద్యశాల/నర్సింగ్ హోమ్/ప్రసూతి గృహంలో పని చేసే సిబ్బంది పై నేరానికి పాల్పడినట్లయితే వారికి విధించే జైలు శిక్షకాలం 3 సం॥ల నుండి 7 సం? ల వరకు ఉంటుందని ఆమె తెలిపారు. ఆన్ లైన్ ద్వారా ఇంటి వద్ద నుంచే దత్తత కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమాచారం కోసం శిశుగృహ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం నారాయణపేటను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్ర మోహన్, డీసీపీ ఓ కరిష్మా, ఆరోగ్య శాఖ అధికారి బిక్షపతి పాల్గొన్నారు.

## బుద్ధ వనములో విదేశీయుల సందడి...

**అక్షర కలం నాగర్జునసాగర్ ః**



నాగార్జునసాగర్ లోని బుద్ధ వనంలో శుక్రవారం విదేశీయుల సందడి నెలకొంది. అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ సందర్శనలో భాగంగా స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, ఫ్రాన్సిస్ దేశాలకు చెందిన బౌద్ధ విదేశీయుల బృందం సాగర్లోని తెలంగాణ టూరిజం విజయ విహార్ గెస్ట్ హౌస్ లో బస చేశారు. సాగర్ సందర్శనలో భాగంగా బుద్ధవనాన్ని విదేశీయుల బృందం సందర్శించింది. దీనిలో భాగంగా మహా మహా స్తూపం అంతర్భాగంలోని ఆచార్య నాగార్జున విగ్రహం చుట్టూ పరిక్రమలు చేశారు. అనంతరం మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను ను వెలిగించి ధ్యానం చేశారు. శుక్రవారం నాగర్జున కొండ మ్యూజియానికి సెలవు కావడంతో శనివారం నాడు ఈ బృందం నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించనుంది. కాగా శు



క్రవారం బుద్ధ వనాని థాయిలాండ్ దేశానికి చెందిన వాట్ థాయ్ బోధగయ బౌద్ధ విహారానికి చెందిన బౌద్ధ మత గురువులు బుద్ధ వనాన్ని సందర్శించారు. వీరికి బుద్ధవనం అధికారులు శాసన, రవిచంద్రలు బుద్ధవనం విశేషాలను తెలియచేసి బ్రోచర్లను అందజేశారు.

## భావితరాలకు నిత్య స్ఫూర్తి దాత మహాత్మ జ్యోతిరావు పూలే

### - జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్

**మందమర్రి/ చెన్నూర్ నవంబర్ 28, అక్షర కలం ప్రతినిధి:-**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ, వర్ధంతిని పట్టణంలోని సింగరేణి పాఠశాల అంబేద్కర్ చౌరస్తా( విగ్రహం వద్ద) శుక్రవారం పట్టణ అధ్యక్షులు సకినాల శంకర్ అధ్యక్షతన జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో పూలు సాగు చేసే (మాలి) కుటుంబంలో జన్మించారు. సామాజిక అసమానతల మీద అలుపెరుగని పోరాటం చేసి నగారిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్తని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సామాజిక తత్వవేత్త మహిళా అభివృద్ధికి మార్గదర్శి, 1871 లో దీనబంధు అనే పత్రిక నడిపాడు. 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక్ సమాజాన్ని స్థాపించి, ముంబైలో సత్యశోధకు సమాజాన్ని ఏర్పాటుకు తెలుగువారైన సయాజి నాగు, వెంకటయ్య ల ను భాగస్వామ్యం చేశారు. పూలే 1873 లో రచించిన గులాంగిరి ఎంతో మందిని ప్రభావితం చేసిందని, ఆయన చేసిన బ్రాహ్మణ అగ్రకులాల పై పోరాటం బిసి కులాలు ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని బిసి రిజర్వేషన్ల కోసం అలుపెరగని పోరాటం చేయాలని, ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ కమిటీ సభ్యులు, పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయి..

## -జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



అక్షరకలం - నల్గొండ టౌన్

క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందని జిల్లా యస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. నల్గొండ పట్టణ కేంద్రంలోని డాన్ బోస్కో పాఠశాలలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ గేమ్స్ ప్రారంభ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, టీమ్‌వర్క్, సహనాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే క్రీడలు యువతనీ సరైన దిశగా నడిపిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోవటములు సహజం ఓటమి గెలుపుకు నాంది అన్నారు. అలాగే చెడు వ్యాసనాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని, వాటి నుండి నేర్చుకుంటూ క్రీడా నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాం రెడ్డి, వన్ టౌన్ సి.ఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదులు, సిబ్బంది ప్రిన్సిపల్ బాల శౌరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

అక్షర కలం/భద్రాచలం

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ ఇరవై తొమ్మిది న నిర్వహించు తెప్పోత్సవం,ముప్పై న నిర్వహించనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం, కళ్యాణ మండపం, అధ్యయన వేదిక, క్యూ లైన్‌లు, భక్తుల



కోసం సెక్టార్ వైజ్ ఏర్పాట్లు వంటి అంశాలపై దేవస్థానం అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. మిథిలా స్టేడియం ఉత్తర ద్వారం ప్రాంతంలో క్యూ లైన్‌ల ఏర్పాటు,



భక్తుల ప్రవేశ%-%నిష్క్రమణ మార్గాలు, భద్రతా బలగాల మోహరింపు, త్రాగునీరు, వైద్య సేవలు, శానిటేషన్, మొబైల్ టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలను కలెక్టర్ వ్యక్తిగతంగా పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ముక్కోటి ఏకాదశి సందర్భంగా లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి చేరుకునే అవకాశం ఉన్నందున ఏర్పాట్లు పూర్తిస్థాయిలో, నిర్లక్ష్యం లేకుండా చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని, వైద్య విభాగం ఇరవై నాలుగు గంటలు అంబులెన్స్‌లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఉత్తర ద్వారం వద్ద బారికేడింగ్, క్యూ లైన్ కవర్లు, లైటింగ్, సీసీ కెమెరాలు, సమాచార ప్యానెల్స్ ఏర్పాటు వంటి పనుల పురోగతిని ఇంజినీరింగ్ విభాగం అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భద్రతా పరంగా పోలీసు విభాగం, దేవస్థానం విజిలెన్స్, శానిటరీ సిబ్బంది అన్ని విభాగాలు పరస్పర సహకారంతో పని చేయాలనిఆయనసూచించారు. భక్తులకు సులభ దర్శనం అందించడం ప్రధానం కావడంతో రెస్టింగ్ పాయింట్లు, మెడికల్ క్యాంపులు వంటి ఏర్పాట్లలో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదని కలెక్టర్ హెచ్చరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే సమయాల్లో అదనపు వాలంటీర్లు, సిబ్బంది మోహరించాలని సూచించారు. దేవస్థానం పరిసరాల్లో స్వచ్ఛత, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు కూడా కీలకమని పేర్కొంటూ, పంచాయతీ శాఖతో దేవస్థానం అధికారులు సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం రోజువారీ పురోగతి నివేదికను సమర్పించి, నిర్ణీత గడువులో అన్ని పనులు పూర్తిచేయాలనిఆయనఆదేశించారుఎటువంటి విభాగం నిర్లక్ష్యం చూపకూడదని హెచ్చరిస్తూ, భక్తుల సౌకర్యం దృష్టిలో ఉంచుకుని మొత్తం ఏర్పాట్లను అత్యుత్తమంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె. దామోదర్ రావు, ఇంజినీరింగ్ విభాగం ఈఈ వి. రవీంద్రనాథ్, ఏఈ ఓలు శ్రవణ్ కుమార్, భవానీ, పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబాపూలే కు ఘన నివాళులు



అక్షరకలం - నల్గొండ టౌన్

మహాత్మ జ్యోతిబా పూలే 135 వ వర్ధంతి ఉత్సవాలను నల్లగొండ లోని జ్యోతిబాపూలే క్లాక్ టవర్ సెంటర్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిబాపూలే గొప్ప మహానీయుడు, ప్రముఖ సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బలహీన వర్గాల అక్షర జ్యోతి, కార్మికులకు దిక్సూచి, మహిళలకు ధ్వజస్తంభం అన్నారు. ఆయన ఆశయ సాధన కొరకు బీసీలు పాటుపడాలన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది అన్నారు. ఇప్పుడు ఇచ్చినటువంటి జీవో 46 ప్రకారం బీసీలకు కేవలం 17శాతం మాత్రమే రిజర్వేషన్ స్థానాలు వస్తున్నాయన్నారు. ఇది బీసీలను మోసం చేయడమే అన్నారు. 135 సంవత్సరాల క్రితం భారతదేశంలో ఉన్నటువంటి సామాజిక రుగ్మతుల పైన పోరాడిన జ్యోతిబాపూలే ఆశయాలు ఇప్పటికీ నెరవేరలేదన్నారు. కోర్టులు కూడా సామాజిక అంశాలను ప్రస్తావించకుండా తీర్పులు ఇవ్వడం వల్ల సమాజంలో అసమానతలు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కంది సూర్యనారాయణ, నల్ల సోమ మల్లన్న, నకిరేకంటి కాశయ్య గౌడ్, వాసుదేవుల వెంకట నరసయ్య, చిక్కుల రాములు, జివాజీ ఇంద్రయ్య, కొల్లోజు సత్యనారాయణ, జెల్లా ఆదినారాయణ, వాడపల్లి సాయిబాబా, చొల్లేటి రమేష్, ఎరుకల శంకర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, బొమ్మరపోయిన కేశవులు, శ్రీహరి ముదిరాజ్, విద్యార్థి సంఘ నాయకుడు నల్ల మధు యాదవ్, మహిళా నాయకురాలు మాధవి పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా వచ్చిన నామినేషన్లు మాత్రమే స్వీకరించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 28:

రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు అభ్యర్థులు సమర్పించే నామినేషన్లను నిర్ణీత గడువులోగా మాత్రమే స్వీకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ, ముత్యంపేట,



రెబ్బెనపల్లి, చెల్కగూడ గ్రామాలకు కొర్విచెల్మ గ్రామపంచాయతీ, నెల్కివెంకటాపూర్, వందూర్ గూడ, చింతపల్లి, తానిమడుగు గ్రామాలకు నెల్కివెంకటాపూర్ గ్రామపంచాయతీ, ద్వారక, కొండాపూర్, ధర్మారావుపేట గ్రామాలకు ద్వారక గ్రామపంచాయతీ, మ్యాదరిపేట,



మామిడిపల్లి, కొత్త మామిడిపల్లి గ్రామాలకు మ్యాదరిపేట గ్రామపంచాయతీ, దండేపల్లి, కర్ణపేట, నర్సాపూర్ గ్రామాలకు దండేపల్లి గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను మండల తహశీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లా3డుతూ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. నవంబర్ 29వ తేదీన సాయంత్రం 5 గంటల లోగా నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని తెలిపారు. నామినేషన్ కేంద్రంలో రద్దీ లేకుండా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనలకు లోబడి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రదర్శించాలని, నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం మండలంలోని ద్వారక గ్రామంలో కొనసాగుతున్న షెడ్యూల్డ్ తెగల బాలుర సంక్షేమ వసతిగృహం నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దొడ్డు రకం, సన్న రకం ధాన్యాలను వేరువేరుగా కొనుగోలు చేయాలని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు సమయంలో రైతుల వివరాలు, ధాన్యం వివరాలను సేకరించి ట్యాబ్ లలో నమోదు చేయాలని, సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పీసీసీ అధ్యక్షుని కలిసిన నూతన డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత

౧ గాంధీభవన్ లో మహాత్మ జ్యోతిబాపూలేకు ఘన నివాళి

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

నల్గొండ డిసిసి అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన పున్న కైలాష్ నేత శుక్రవారం హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర అధిష్టానం డిసిసి అధ్యక్షునిగా నియమించిన అనంతరం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిసింది. మహాత్మ జ్యోతిబాపూలే 135వ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిసి ప్రెసిడెంట్ తో పాటు కలిసి కార్యక్రమంలో పాల్గొని మహాత్మ జ్యోతిబాపూలే కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి, డిసిసి నేతలు చరణ్ కౌశిక్, శ్రీహరి నాయక్, లింగం యాదవ్,



మానవతా రాయ్, రాంబాబు నాయుడు, సైదులు యాదవ్, రాంబాబు, బాలకృష్ణ, మచ్చ వరలక్ష్మి, నేతళ్ల ఆంజనేయులు, అశోక్ గౌడ్, కృష్ణ యాదవ్, రాము, స్వామి యాదవ్, మిర్యాల విజయ్ నేత, చెనగోని వెంకన్న, బీసం రాకేష్, సైదులు మాదిగ, ఉమేష్, వీరేశం, కొండ శరత్ కుమార్, నీరజా గౌడ్, ఎండీ. కైసర్ తదితరులు పాల్గొన్నారు.

# జిఓ నెంబర్ 46 ను వెంటనే రద్దు చేయాలి

## తెలంగాణ తల్లి విగ్రహానికి వినతిపత్రం

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 28:

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ నెంబర్ 46 ను వెంటనే రద్దు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్ లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి సంఘం ఆద్వర్యంలో వినతిపత్రం అందజేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు స్థానిక సంస్థలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు జిఓ నెంబర్ 46 ను జారీ చేసి, తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. గతంలో 22 శాతం బీసీ రిజర్వేషన్లు ఉంటే ఈ జిఓ తో అవి 17 శాతానికి మాత్రమే పరిమితమయ్యాయంటే ఇది బీసీల పట్ల తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ల తోనే ఎన్నికలకు వెళ్తామని చెప్పి బీసీ సమాజాన్ని మోసం చేయడం బాధాకరమన్నారు. అఖిల పక్షంగా ప్రధాని నరేంద్ర మోడీ దగ్గర ఒత్తిడి తీసుకురావాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ ఊసే ఎత్తకపోవడం అంటే బీసీలను కనీసం సర్పంచ్ లుగా, ఎంపిటిసి, జడ్పిటిసిలుగా అవకాశాలు కల్పించడం ఇష్టం లేదనే భావిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 306 సర్పంచ్ స్థానాలకు గాను బీసీ జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన స్థానాలు 155 అయినప్పటికీ ప్రస్తుతం కేటాయించిన స్థానాలు 23 అని, జిల్లాల్లో బిసి లకు స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్లు కేవలం 7 శాతం మాత్రమే అమలవుతుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెంబర్ 46 ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు గజెల్లి వెంకటయ్య, శాఖపురి భీమ్సేన్, కీర్తి బిక్షపతి, అంకం సతీష్, వేముల అశోక్, రామగిరి రాజన్న చారి, పంపరి వేణుగోపాల్, వెంకటేష్, వేముల కిరణ్, చెలిమెల అంజయ్య, రాజేశం గౌడ్ లు పాల్గొన్నారు.



## మేరాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడుగా సయ్యద్ మస్తాన్ వలి ఎన్నిక



అక్షర కలం/ సత్తుపల్లి

సత్తుపల్లి పట్టణంలోని వెంగళరావు నగర్ కాలనీలో గల మేరాజ్ మసీదు కమిటీ నూతన అధ్యక్షుడుగా (సదర్)సయ్యద్ మస్తాన్ వలి (కరెంట్ మస్తాన్)ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంగళరావు నగర్ కాలనీ మేరాజ్ మసీదు మషూరా కమిటీ పెద్దలు మసీదు కమిటీ అధ్యక్షుడిగా మెరాజ్ మసీదుకు మరియు మసీదుకు వచ్చే భక్తులకు సేవ చేయాలనుకునే ఆసక్తి ఉన్న వారి నుండి గత వారం క్రితం దరఖాస్తులు ఆహ్వానించడం జరిగింది. ఆసక్తి ఉన్న పలువురు అభ్యర్థులు మెరాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా సేవ చేయడానికి దరఖాస్తులు చేసుకున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మషూరా కమిటీ పెద్దలు దారఖాస్తుదారులతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపి అందరి ఆమోదంతో సయ్యద్ మస్తాన్ వలీని మేరాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని శుక్రవారం రోజు ప్రార్ధనల అనంతరం ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన మేరాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మేరాజ్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు వెంగళరావు నగర్ ముస్లిం సోదర సోదరీమణులకు మషూరా కమిటీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. మేరాజ్ మసీదుకు మరియు మసీదుకు వచ్చే భక్తులకు ఎప్పటికీ అందుబాటులో ఉండి అందరినీ కలుపుకుని పోయి మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పట్టణంలోని పలువురు ప్రముఖులు,పట్టణ ముస్లిం లు కొత్త అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షులు షేక్ సలీం మీర్జా బేగ్,మాజీ అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, మహ్మద్ గఫార్ ఖాన్,షేక్ పాషా (మహీంద్రా పాషా), షేక్ ఫజలుర్ రహమాన్, షేక్ సిలార్, షేక్ లాల్ మహ్మద్ , షేక్ ఇస్మాయిల్, షేక్ ఖాదర్, మహ్మద్ ముద్దు మరియు వెంగళరావు నగర్ ముస్లిం లు పాల్గొన్నారు.

## మనువాదంపై తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు పూలే-బాగం హేమంతరావు



ప్రజాపక్షం/ ఖమ్మం :

తరతరాలుగా ప్రజలను అజ్ఞానం నుంచి దోపిడీ చేస్తున్న మనువాదంపై సామాజిక తిరుగుబాటు చేసిన విప్లవ వీరుడు మహాత్మా జ్యోతిబాపూలే అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ గిరిప్రసాద్ భవన్లో శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే 129వ వర్ధంతి సందర్భంగా పూలే చిత్ర పటానికి బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి ఆధిపత్య వర్గం మను స్మృతి దేశంలో ప్రజలను శుద్రులు, అతి శుద్రుల పేరుతో చదువుకు దూరం చేసిందని వారికి విజ్ఞానం అందుకుండా చేసిందన్నారు. దోపిడీ అణిచివేతకు గురవుతున్న శుద్రుల, అతి శుద్రులను మహిళలను చైతన్యవంతుల్ని చేయడానికి –నాటి సామాజిక కట్టుబాట్లను ఎదిరించి 1948లో విద్యా బోధన కోసం పాఠశాలను ప్రారంభించారన్నారు.ఇందు కోసం పూలేతో పాటు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే అనేక అవమానాలను భరించారన్నారు. వారిని –ఆదర్శంగా తీసుకుని బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం పోరాడారన్నారు. యదృశ్చికమైన 1948 లో కారల్ మార్క్స్ పెట్టుబడిదారి దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటం చేయాలని కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను విడుదల చేశారు. సరిగ్గా ఆ కాలంలోనే మన దేశంలో జ్యోతిరావు పూలే మనుధర్మంపై పోరాటం చేస్తూ –శుద్రులు, అతి శుద్రులు, మహిళలకు ప్రత్యేక పాఠశాలలు ప్రారంభించారన్నారు. పూలే జీవితం నేటి తరానికి –ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, బిసి హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, మహిళ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాటి నిర్మల, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె –లక్ష్మి నారాయణ, జిల్లా సమితి సభ్యులు పేరబోయిన మోహన్రావు, గాయకులు దాసరి రాము, నాయకులు జ్వాలా నర్సింహారావు, నంబూరి శంకర్రావు, వాడపల్లి యాకయ్య, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజుకు జీవన సాఫల్య పురస్కారాన్ని బహుకరించిన భారత్ గౌరవ్ ఫౌండేషన్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:



తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల చంద్రశేఖర రావు సాధించి పెట్టడమే కాక తన పదేళ్ల పాలనలో హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.కేసీఆర్ మార్గనిర్దేశనంలో ఐటీ,పురపాలక,పరిశ్రమల శాఖల మంత్రిగా కే.టీ.రామారావు అమెరికాలోని న్యూయార్క్,డల్లాస్,చికాగోలకు ధీటుగా హైదరాబాద్ నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేశారని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న భారత్ గౌరవ్ ఫౌండేషన్ ఎంపీ రవిచంద్రకు జీవన సాఫల్య పురస్కారాన్ని బహుకరించింది.ఫౌండేషన్ 8వ వార్షిక పురస్కారాల ప్రదానోత్సవం హైదరాబాద్ హైటెక్ సిటీలోని అవాసా హోటల్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఘనంగా జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి పురస్కారాన్ని అందుకున్న ఎంపీ వద్దిరాజు మాట్లాడుతూ,కేసీఆర్ హయాంలో హైదరాబాద్ ఐటీ,ఫార్మా హబ్ గా రూపుదాల్చిందని...ఇక్కడ నుంచి ఎంతోమంది గొప్పగా ఎదిగి పలు దేశాలలో ఉన్నత పదవుల్లో అధిష్టించి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.మన దేశంలో యువతకు ఏ మాత్రం కొదవ లేదని,అపారమైన యువ సంపద ఉందని,40 ఏండ్ల వయస్సు లోబడి ఉన్న వాళ్లు కోట్ల మంది ఉండడాన్ని మొన్ననే ఖమ్మంలో సర్దార్ పటేల్ "యూనిటీ రన్"సందర్భంగా గుర్తు చేశానన్నారు.యువతకు అవకాశాలు ఇస్తే,వారి శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత గొప్పగా ప్రగతిపథాన పరుగులు పెడుతుందన్నారు.ఫౌండేషన్ నిర్వాహకులు సందేశ్ యాదవ్,ఆయన బృందం ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీ రవిచంద్ర చెప్పారు. రాజ్యసభ సభ్యుడిగా తాను విద్య, వైద్యారోగ్య రంగాల ఉన్నతికి,చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్,చిన్నజీయర్ స్వామి, ఒలింపిక్ ఛాంపియన్ సైనా నెహ్వాల్, ఐపీఎస్ అధికారి అంజనీకుమార్ తదితరులు ప్రసంగించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు నిర్వాహకులు పుష్పగుచ్ఛమిచ్చి సాదర స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు.



# ఎన్నికల విధులను ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి....

### సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తదే కాళీచరణ్ సుదామ రావు

### ప్రతి ఫిర్యాదును తప్పనిసరిగా నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలి

### ప్రసార మాధ్యమాల ప్రకటనలపై నిఘా పెట్టాలి

### పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్ ను పరిశీలించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు





అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఎన్నికల విధులను అధికారులు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తదే కాళీచరణ్ సుదామ రావు అన్నారు.సాధారణ ఎన్నికల పరిశీలకులు, పంచాయతీ ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఎంసిఎంసి సెల్, మీడియా సెంటర్లను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు ఖర్తదే కాళీచరణ్ సుదామ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పిస్తూ పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు భారత ఎన్నికల కమీషన్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని, నిబంధనలను రూపొందించిందని వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయడం మన కర్తవ్యమని అన్నారు.1077 టోల్ ఫ్రీ నెంబర్, సామాజిక మాధ్యమాలలో, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే క్షేత్ర స్థాయిలో ఉన్న బృందాలకు తెలియజేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో పనిచేసే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాల వివరాలను నోటీస్ బోర్డు ద్వారా తెలియజేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికలకు సంబంధించి నిరంతరం పర్యవేక్షణ జరగాలని, సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వచ్చే ప్రతి ఫిర్యాదును రిజిస్టర్ లో నమోదు చేసుకుని వెంటనే క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలకు సమాచారం అందించాలని అన్నారు. సామాజిక మాధ్యమాలలో ఎన్నికల నిర్వహణ పట్ల అపోహలు కలిగే దుష్ప్రచారాలు గమనించిన వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమాచారం చేరే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బృందం మూడు షిఫ్టులలో 24 గంటల పాటు పనిచేస్తుందని, దానికి అనుగుణంగా సిబ్బంది నియామకం, అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, డిపిఓ ఆశాలత, డీపీఆర్ఓ ఎం.ఎ. గౌస్, ఎంసిఎంసి కమిటీ సభ్యులు మురళి, రమేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమికి అవకాశం ఇస్తే అభివృద్ధికి నిజమైన నిర్వచనం చూపిస్తాం

### మానే రామకృష్ణ బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి

అక్షర కలం /భద్రాచలం

భద్రాచలం గ్రామపంచాయతీకి పాలకవర్గం లేక అధికారుల హయాములో అవినీతి రాజమేలుతుందని సుపరిపాలన స్వపరిపాలన అందించేందుకే సిపిఐ ఎం బిఆర్ఎస్ గద్వాన దండ కారుణ్య పార్టీ కూటమిగా ఏర్పడి స్థానిక సంస్థల బరిలో దిగుతున్నామని సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చందర్రావు భవనంలో సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి బిఆర్ఎస్ కన్వీనర్ ఆకోజి సునీల్ కుమార్ ల అధ్యక్షతన జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రెండు వేల పద్దెనిమిది నుండి నేటి వరకు గ్రామపంచాయతీలో పాలకవర్గం లేకపోవడం వల్ల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేదలు నివాసం ఉండే కాలనీలను గాలికి వదిలేసి సంపన్నుల ప్రాంతాల్లోనే అభివృద్ధి చేశారని ఆ అభివృద్ధిలో కూడా అనేక అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. పట్టణంలో అనేక కాలనీలలో సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లమీదకి చేరి దోమలు సైరవిహారం చేస్తున్నాయని ప్రజలు రోగాల బారిన పడుతున్న అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని అన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నిజాయితీ నిస్వార్థ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత భద్రాచలం ప్రజలపై ఉందని ఏజే రమేష్ స్పష్టం చేశారు. ఆదర్శవంతమైన పాలన అందించేందుకు కూటమి సమర్థవంతమైన అభ్యర్థులను నిలబెడుతుందని ఈనెల పదకొండో వ తారీఖున జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామ స్వరాజానికి నాంది పలకాలని ఏజ రమేష్ పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణ అభివృద్ధి కేవలం బి ఆర్ ఎస్ పార్టీ హయంలో జరిగిందేనని రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో భద్రాచలానికి ఒరిగింది ఏమీ లేదని బి ఆర్ ఎస్ సర్పంచ్ అభ్యర్థి మానే రామకృష్ణ విమర్శించారు. పట్టణ వ్యాప్తంగా ప్రతి




ఇంటికి మంచినీటి పంపులను అందించిన ఘనత బి.ఆర్ పార్టీకే దక్కుతుందని రామకృష్ణ అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇసుక లారీల బీభత్సంతో పట్టణంలోని ప్రధాన రహదారి ధ్వంసం అయిపోయిందని ఆయన ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్కి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బుద్ధి చెప్పి సిపిఐఎం బిఆర్ఎస్ జిడిపి పార్టీల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. భద్రాచలం పట్టణ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నదని సిపిఐ ఎం సహకారంతో సర్పంచ్ ఎన్నికలలో గెలిచి నిస్వార్థ నిజాయితీ పరిపాలన అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న అభ్యర్థులను నిలబెడుతున్నాం గద్వాన దండకారణ్య పార్టీ కన్వీనర్ శరత్ బాబుభద్రాచలం పట్టణ సమస్యలపై పూర్తి అవగాహన ఉండి నిజాయితీగా అభివృద్ధి చేసే అభ్యర్థులను కూటమి తరపున నిలబెడుతున్నామని గద్వా న దండకారణ్యపార్టీ కన్వీనర్ గుండి శరత్ బాబు స్పష్టం చేశారు. సిపిఎం బిఆర్ఎస్ జిడిపి పార్టీల కూటమి అభ్యర్థులను గెలిపించి అవినీతి కాంగ్రెస్ కి బుద్ధి చెప్పాలని కోరారు. మూడు పార్టీలతో పాటు కలిసి వచ్చే సామాజిక ఆదివాసి సంఘాలను కలుపుకొని ఈ ఎన్నికల బరిలో దిగుతున్నామని కూటమి సర్పంచ్ అభ్యర్థి అయిన రామకృష్ణాని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి గ్రామ స్వరాజానికి నాంది పలకాలని గుండు శరత్ బాబు పిలుపునిచ్చారు.

#### నిజాయితీ పాలనకు స్వాగతం పలకండి

#### ఎం బి నర్సారెడ్డి సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

సిపిఐఎం బిఆర్ఎస్ జిడిపి కూటమి నిస్వార్థ నిజాయితీపరులను స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థిగా నిలబెడుతుందని ఏమాత్రం అవినీతి చరిత్ర లేని నిస్వార్థ అభ్యర్థులను గెలిపించి నిజాయితీ పాలనకు భద్రాచలం పట్టణ ప్రజలు స్వాగతం పలకాలని ఎం బి నర్సారెడ్డి పట్టణ ప్రజలను కోరారు. పాలకులు స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని పంచాయతీలకు ఉండాల్సిన హక్కులను సైతం ఎమ్మెల్యేలు ఎంపీలు కాజేస్తున్నారని నర్సారెడ్డి ఆరోపించారు. అభివృద్ధి అంటే కేవలం సంపన్నులు ఉన్నచోటే కాదని పేదలు దళితులు బడుగు బలహీన వర్గాల నివాస ప్రాంతాలలో కూడా అభివృద్ధి చేస్తేనే సమగ్ర అభివృద్ధి అవుతుందని భద్రాచల పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని నర్సారెడ్డి స్పష్టం చేశారు. ఈ పాత్రికేయుల సమావేశంలో సిపిఐ ఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగా, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రమోద్ కుమార్, రామకృష్ణ, జిడిపి పార్టీ నాయకులు గుండి ప్రదీప్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు,పారిల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి,టిఆర్ఎస్ మహిళా నాయకులు పూజల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

# ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు

### -మాజీ జెడ్పిటిసి జెర్పుల దశరథ్ నాయక్

కల్వకుర్తి,నవంబర్ 28,అక్షరకలంన్యూస్:

-ఎలక్షన్ వద్దు ఏకగ్రీవమే ముద్దు అని మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు.ఎలక్షన్ లలో పూటపోటికి పోవడం వల్ల బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడడమే తప్ప ప్రయోజనం ఏమీ లేదని ఓటర్లకు సూచించారు. తమ గ్రామ పంచాయతీలో అందుబాటులో ఉండేటటువంటి వ్యక్తిని అన్ని రకాలుగా తమకు సహకరించే వ్యక్తిని ఎన్నుకొని ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో వ్యక్తి తప్ప పార్టీలకు ప్రాధాన్యత ఇవ్వకూడదని తెలిపారు. గత ఎన్నికల్లో కడ్తాల్ మండలంలో ఐదు గ్రామపంచాయతీలో సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లను ఏకగ్రీవం చేశామని ఈ ఎన్నికల్లో దాదాపుగా అదే మాదిరిగాగ్రామపంచాయతీలో సర్పంచ్లను వార్డు మెంబర్లను ఏకగ్రీవం చేసుకొని అన్నదమ్ముల్లాగా ఒకే కుటుంబ సభ్యులు లాగా కలిసిమెలిసి ఉండాలని కోరారు.





# డిసెంబర్ 3న.. హైద్రాబాద్‌లో మహా ధర్నా..!

-పుష్కర కాలంగా పరిష్కారం కాని జర్నలిస్టుల సమస్యలు
-మహా ధర్నాకు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావాలి
- ప్రెస్ మీట్ లో టీ యు డబ్ల్యూ జె (ఐ జె యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారాయణ పాల్గొన్న జిల్లా, రాష్ట్ర నాయకులు, జర్నలిస్టులు




అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

రాష్ట్రంలో గత 12 సంవత్సరాలుగా జర్నలిస్ట్ ల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం పై నిరసన వ్యక్తం చేస్తూ డిసెంబర్ 3న హైద్రాబాద్ లోని మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయం ముందు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టేకోల రామ్ నారాయణ తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, నర్వనేని వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మైస పాపారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు తదితరులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పుష్కర కాలంగా జర్నలిస్ట్ లు ఎదుర్కొంటున్న సమస్య ల పరిష్కారంలో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని రామ్ నారాయణ ఆరోపించారు. మాటలకే పరిమితం అయ్యాయని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే జర్నలిస్ట్ ల సమస్య లను వెంటనే పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు అవుతున్నా మాటలతో కాలం గడుపుతూ జర్నలిస్టుల సమస్యలును పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా లో ముగ్గురు మంత్రులు ఉన్న గాని, సమాచార శాఖ మంత్రి కూడా జిల్లాకు చెందిన వారు ఉన్నా గాని, జర్నలిస్ ల సమస్యలు పరిష్కారం విషయంలో మాటలకే పరిమితం అయ్యారని వాపోయారు. జర్నలిస్టు ల సమస్య లైన అక్రిడిటేషన్ కార్డులు మంజూరు, హెల్త్ కార్డుల పంపిణి, ఇంటి స్థలాలు కేటాయింపు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో జర్నలిస్ట్ లు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహా ధర్నా పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ ప్రెస్ మీట్ లో యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, ఖమ్మం నగర కమిటీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి జనార్ధన చారి, కోశాధికారి ఏలూరు వేణుగోపాలరావు, జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఖమ్మం ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, కోశాధికారి కళ్యాణ్, మేడి రమేష్, కెమెరా జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆలస్యం అప్పారావు, ఫోటో జర్నలిస్టుల అధ్యక్షుడు కమటం శ్రీనివాస్ పాల్గొన్నారు.




## నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి
-నామినేషన్ స్వీకరణ కేంద్రాల తనిఖీ




అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఆమె మర్రిగూడ మండలం, సరంపేట, శివన్న గూడెం, వట్టిపల్లి గ్రామాలలో పర్యటించి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సహాయ డెస్క్ ల ఏర్పాటు, అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థులు సమర్పించే నగదును ఎలా స్వీకరిస్తున్నారని ? అలాగే వారికి రసీదు ఇస్తున్నారా? అని అడిగారు. డిజిటల్ గోడ గడియారం అమర్చుకోవాలని చెప్పారు. చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన నామినేషన్లను టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. తాగునీటి సౌకర్యం, వికలాంగుల కోసం ర్యాంపులు, వీల్ చైర్లు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి అభ్యర్థి గౌరవంగా ఇబ్బందిలేకుండా నామినేషన్ దాఖలు చేయగల వాతావరణ కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. చండూర్ ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, తదితరులు ఉన్నారు.

## మరికల్ మండలంలోనీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన: - సీఐ రాజేందర్ రెడ్డి.

(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్,28)




జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మరికల్ : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మరికల్ సీఐ రాజేందర్ రెడ్డి, %వా×% రాము లు కలిసి మరికల్ మండల పరిధిలోని మరికల్, పెద్దచింతకుంట, అప్పంపల్లి, తీలేరు గ్రామలలోనీ వివిధ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం రోజు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రాథమిక సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, బ్యారికేడ్లు, మరుగుదొడ్లు, శానిటేషన్ వంటి ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. అదే విధంగా, పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవకుండా పోలీసు భద్రతా చర్యలు, చుట్టుపక్కల నిఘా, క్రమశిక్షణపై ప్రత్యేక సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ, ప్రజలు భయపడకుండా, స్వేచ్ఛగా తమ ఓటును హక్కును వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది అని సీఐ తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నాంపల్లి అక్షర కలం



నామ్ వరి ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో మాధవరెడ్డి సుంకిశాలలో శుక్రవారం ప్రారంభించారు ప్రేమ శాతము తక్కువ వచ్చిన రైతుల వడ్లను చెక్ చేసి తూకం వేయించి లారీ ద్వారా మేలుకు పంపించారు నాణ్యతగా తీసుకురావాలని రైతులకు సూచించారు ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పురుషోత్తం కిరణ్ బాబు వెంకటయ్య రాములు తదితర రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అంతర్జాల కథా సదస్సుకు పోతురాజుకు ఆహ్వానం

అక్షర కలం/ సత్తుపల్లి



ఉత్తర అమెరికా తెలుగు సంఘం 'తానా' ఆధ్వర్యంలో నవంబర్ 30వ తేదీన జరగనున్న అంతర్జాతీయ అంతర్జాల బాల సాహిత్య భేరీలోపాల్గొనడానికి బాల సాహిత్య రచయిత ఆవుల పోతురాజుకు ఆహ్వానం అందింది. తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ శతాధిక బాల రచయితల సమ్మేళనాన్ని ఈనెల ముప్పైన 'బాల సాహిత్య భేరీ'పేరుతో నిర్వహిస్తున్నది. అంతర్జాల వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా బాల సాహితీవేత్తలు పాల్గొంటున్నారు. సత్తుపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుచున్న పోతురాజు ఆరోజున జరిగే బాల సాహిత్య భేరీలో ప్రథమంగా కథల విభాగాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే రచయితలు ఇరవై ఆరుగురు తాము రాసిన కథలలో ఒక దానిని చదివి వినిపిస్తారు. ఆవుల పోతురాజు తాను రచించిన'నాన్నే నా హీరో' పుస్తకం నుండి ఒక కథను చదివి వినిపిస్తారు. ఈ మేరకు తానా అధ్యక్షులు డాక్టర్ నరేన్ కొడాలి,నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర,సమన్వయ కర్త చిగురుమళ్ళ శ్రీనివాస్ నుండి పోతురాజుకు ఆహ్వానం అందింది. అరుదైన ఈ అవకాశాన్ని దక్కించుకున్న పోతురాజును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్కే సోందు,తెలుగు ఉపాధ్యాయిని ఎం.రమాదేవి, గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన రాజులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

## మధ్యాహ్న భోజన వంట పాత్రల పంపిణీ:

- మండల విద్యాధికారి మీర్జా కలీముల్లా .



(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, నవంబర్,28)

మరికల్: మరికల్ మండల వనరుల కేంద్రం లో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంట పాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు .మరికల్ మండలం లోని 23 పాఠశాలలకు 30 కేజీల నుంచి 5 కేజీల వరకు అన్నం మరియు కూర పాత్రలు, ప్రతి పాఠశాలకు రెండు బకెట్లు, రెండు బేసన్లు, రెండు అన్నం చెంచాలు, రెండు సాంబార్ చెంచాలు, రెండు కంటైనర్లు మరియు ఉన్నత పాఠశాలలకు కాఫ్గిర్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మీర్జా కలీముల్లా , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగరత్నమ్మ , బాల నారాయణ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ గౌడ్ గారు, శ్రీ విజయ కృష్ణ మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు మరియు మండల వనరుల కేంద్ర సిబ్బంది శివకుమార్, అరుణ, ప్రవీణ్ కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం మరియు విద్యాశాఖ నుంచి వచ్చిన వంట పాత్రలను మధ్యాహ్న భోజన కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే..

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

ఖమ్మం : ఖానాపురం హవేలీ లిక్కి కృష్ణారావు అధ్యక్షతన పూలే అంబేడ్కర్ అధ్యయన వేదికలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు బహుజన మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సాధు మాలాద్రి హాజరై మొట్ట మొదటిసారిగా భారతదేశంలోనే చదువు అందరికీ కావాలని ఉద్యమించినవాడు తనే స్వయంగా ఉచిత పాఠశాలను ఏర్పాటు చేసి తన భార్యకు కూడా చదువును నేర్పి బాలలకు మహిళలకు ఎన్ని ఆటంకాలు వచ్చినా చదువును అందించిన వాడు పూలే అని అన్నారు . సత్యశోధక్ సమాజాన్ని ఏర్పాటు చేసి నిజాన్ని నిబ్బరంగా చెప్పినవాడు బ్రాహ్మణీయ వాదము నుండి సూద్రా కులాలు విముక్తి కావాలని పోరాడినవాడు పూలే . అంతటి మహనీయుడు చూపించిన మార్గం ద్వారా నేడు తెలంగాణ ప్రాంతంలో బీసీల రిజర్వేషన్ కోసం ఉద్యమించాలని అన్నారు. మరో వక్త సుంకర శీను మాట్లాడుతూ పూలే ఆశయాన్ని కొనసాగించడం అంటే నేడు బీసీలు రిజర్వేషన్ సాధించుకోవడంతోపాటు బహుజన రాజ్యాధికారం సాధించడమే ఆశయంగా ఉండాలని అన్నారు . బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె పర్వతాలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బహుజన కుల సంఘాలను ఏర్పాటు చేసి రాజ్యంపై తిరుగుబాటుడంకా మోగించిన కామ్రేడ్ మారోజు వీరన్న ఆలోచనతో ఈ రాష్ట్రంలో కుల సంఘాల నిర్మాణం జరిగి మా శక్తిగా ఎదగాలని సూచించారు . బిఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి గాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రాహ్మణీయ వాదాన్ని ఆధిపత్య కులాలను వారు ఏర్పాటు చేసుకున్నా రాజకీయ పార్టీలను తక్షణమే బీసీలు వాటి నుండి బయటపడాలని సూచించారు . పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొడకండి రాంబాబు మాట్లాడుతూ నవంబర్ 30న బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయాల్సిన బాధ్యత దళిత బహుజన జాతులపై ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో సామాజిక నాయకులు మేకల సుగుణ , బహుజన టీచర్స్ యూనియన్ లీడర్ నాగమణి , సంపత్ , లింగనబోయిన లక్ష్మణ్ , పి ఆర్ దేవి , పెరుగు రమణ , ముత్యాలరావు , నరేష్ , దార వెంకయ్య , బసవయ్య పాల్గొన్నారు .



## సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ సంక్షేమం కోసం కృషి

-జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్
-పోలీసు ఉద్యోగులకు కుటుంబ సభ్యులకు మేఘా హెల్త్ క్యాంప్
-పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద వహించాలని సూచన
-జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

అక్షరకలం - నల్గొండ

పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పి సంకల్పంతో అపోలో, రినోవా, మెడికవర్, మ్యాక్స్ విజన్ , రైన్బో చిల్డ్రన్, క్లౌ డెంటల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జిజిహెచ్ నల్లగొండ హస్పటల్ డాక్టర్ల వారి సహకారంతో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ%శీ%లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో అధికారులకు, సిబ్బందికి వారి కుటుంభం సభ్యులకు నిపుణులైన కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్, గ్యాస్ట్రాలజీ, డెర్మటాలజీ, పీడియాట్రిషన్, ఆంకాలజీ,ఈయన్టీ, పల్మనాలజీ, దంత సంబంధిత వైద్యులతో సుమారు 2000 మంది సిబ్బందికి బిపి, షుగర్, ఈసీజీ, 2 డి.ఈకో, పి.ఎఫ్టి, బి.ఎండి డిజిటల్ ఎక్సరే లాంటి పరీక్షలు నిర్వహించి వైద్యులు తగు సూచనలు, సలహాలు అందించి కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్ వారి సహకారం తో మందులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం, నిద్ర లేకపోవడం వలన అనేక రకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంటుందనీ అన్నారు. ముఖ్యంగా సిబ్బంది విధులతో పాటు ఆరోగ్య దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించాలనీ అన్నారు. ప్రతి రోజూ వ్యాయామం, నడక, యోగాలాంటివి రోజువారీ దిన చర్యలో బాగం చేసుకోవాలని అన్నారు. విధి నిర్వహణే కాకుండా సిబ్బంది వారి సంక్షేమం కొరకు ఉచిత హెల్త్ క్యాంపు లు నిరహిస్తున్నామని అన్నారు. గత




సంవత్సరం నిర్వహించిన మెడికల్ క్యాంపులో 8 మందికి గుండె సంబంధిత వ్యాదులు ఉన్నాయని గమనించి సరైన చికిత్స అందించి కాపాడడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, వైద్యుల సలహాలు సూచనలు పాటించాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంపుకు సహకరించిన టి. సాయి కిరణ్ ఏజియం కార్పొరేట్ సర్వీసెస్ రెనోవా హాస్పటల్స్ హైద్రాబాద్, ఐ.ఎం.ఏ ప్రెసిడెంట్ డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రాజేష్, బొల్లం మెడికల్ అంకలాజిస్ట్ అండ్ ఎక్సక్యూటివ్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్రనాథ్, సి.ఓ.ఓ రెనోవా హాస్పిటల్ తదితర వైద్యులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నేడు మిర్యాలగూడ డివిజన్ పరిధిలోనీ సిబ్బందికి హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బి డియస్పి మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివ రాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, డాక్టర్ ఉదయభాస్కర్, సుదీర్, ఆర్థోపెటిక్, డాక్టర్ సాయి సందీప్ పాలమానాలాజిస్ట్, అంకలాజిస్ట్ డాక్టర్ సాయి, డాక్టర్ సుజాత గైనకాలగిస్ట్, డాక్టర్ డేవిడ్ ప్రిడియాట్రీషన్, ఐ.యం.ఎ ప్రసిడెంట్ డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, డ్రగ్ అండ్ కెమిస్ట్రీ ప్రెసిడెంట్ పరమాత్మ, సిఐలు రాఘవరావు, మహా లక్ష్మయ్య, రాజశేఖర్ రెడ్డి, శ్రీను నాయక్, రఘువీరారెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, నరసింహ, ఎస్ఐలు, సైదులు, పాల్గొన్నారు.

# నూతన ఉత్పత్తుల పై దృష్టి సారించి ఆర్థికంగా ముందుకు ఎదగాలి.. -జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

మహిళా సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా నుండి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్ కు జిల్లా నుండి వెళుతున్న స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రత్యేక బస్సు కు ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జండా ఊపి ప్రారంభించారు. కళా మహోత్సవ్ లో దేశంలోని వివిధ ప్రాంతాలలో తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించడం జరుగుతుందని, అలాంటి స్టాల్స్ ను మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సందర్శించడం వల్ల విభిన్న ఉత్పత్తుల తయారీపై అవగాహన కలుగుతుందని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు, సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, వారి కట్టుబాట్లు, ఆచార, వ్యవహారాలు తెలుసుకునేందుకు ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు నూతన ఆలోచనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడం పై దృష్టి సారించాలని తద్వారా మరింత ఆరి ధ కంగా ఎదిగే ఆకాశం ఉందని అన్నారు. డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిపిఎంలు, ఏపీఎంలు, ఉన్నారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిభాపూలే వర్ధంతి




**అక్షరకలం - నల్గొండ టౌన్**

మహాత్మా జ్యోతిభా పూలే వర్ధంతినీ సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నల్లగొండలోని మహాత్మా జ్యోతిభాపూలే విగ్రహానికి సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా.బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావ్ పూలే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని చెప్పారు. డా. బీ ఆర్ అంబేద్కర్ కు గురువు అయిన పూలే విద్య ద్వారానే బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆనాడే చెప్పి ఆచరణకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. బాలికలకు చదువు ఎందుకు అన్న కాలంలోనే దానిని ఎదిరించి చదువు అవసరం ఆవశ్యకతను వివరించి తన భార్య సావిత్రిబాయి పూలే కు చదువు నేర్పించి ఆమె ద్వారా బాలికలకు విద్య నందించారని చెప్పారు. తన భార్య ద్వారా ఎంతో మంది బాలికలకు, మహిళలకు చదువు నేర్పించి దేశంలోనే తొలి మహిళ గురువుగా తీర్చిదిద్దారని కొనియాడారు. పూలే సేవలు మరువలేనివనీ చెబుతూ అన్ని వర్గాలు ఆయనను గుర్తుచేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షులు దుష్యర్ల సత్యనారాయణ, నేలపట్ల సత్యనారాయణ, జీడిమెట్ల రమేష్, మేఖల శ్రీహరి, మేడి యాదయ్య, వంశీ, సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


# కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి అభిషేకం, మహా పడిపూజ!

**నల్లగొండ అక్షర కలం**

నల్లగొండ పట్టణం ఎస్ఎల్ఎన్ కాలనీ లోని వెన్నెల సారీస్ జువెలరీస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి వారికి మహా అభిషేకం,మహా పడిపూజ అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. స్వామివారికి సమర్పించిన పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో అయ్యప్ప స్వామివారి మూలవిరాట్టుకు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అభిషేకం జరుగుతున్నంత సేపు భక్తులు “స్వామియే శరణం అయ్యప్ప” అంటూ భక్తి పారవశ్యంతో భజనలు



చేశారు. భక్తులలో ఆధ్యాత్మిక అనుభూతిని నింపింది. ప్రత్యేకంగా అలంకరించిన 18 పవిత్ర మెట్లకు (పడి) మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ పూజా కార్యక్రమాన్ని మేడం విశ్వ ప్రసాద్ గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న మాలధారులు, భక్తులుఈ పడిపూజలో ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. రంగురంగుల పుష్పాలు, దీపాలతో అలంకరించబడిన పడిని చూడటం భక్తులకు కన్నుల పండుగగా అనిపించింది. నిర్వాహకులు చొక్కారపు వెంకటేశ్వర్లు, మాధవి,సాయి నిఖిల్, వెన్నెల, లక్ష్మమ్మ, స్వామివారి సేవలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. అనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వి జరిగింది. ఈ కార్యక్రమంలోవినోద్, ప్రీతీ, నిర్మల, దేవేందర్,పుష్ప, ఆంజనేయులు, సముద్రాల కుమార్, రాములమ్మ, శ్రీధర్, పద్మ, ప్రభ, వేణు,భాను, సురేష్, మమత, కవిత, భవాని, సరిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తా...

## పాత్రికేయుడు షఫీ కి 50,000 ఆర్థిక సాయం అందించిన మంత్రి అడ్లూరి:

**హైదరాబాద్: నవంబర్ 28, ( అక్షర కలం న్యూస్):**

జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఐ న్యూస్ రిపోర్టర్ మమ్మద్ షఫీ అనారోగ్యానికి గురై హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంత్రి లక్ష్మణ్ కుమార్ షఫీ చికిత్స కోసం రూ. 50,000 ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్థిక సహాయాన్ని అందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తాను రాజకీయంగా ఎదగడానికి కారణమైన పాత్రికేయ మిత్రులను ఎప్పుడు మరిచిపోనని అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగిత్యాల పాత్రికేయులు తనకు ఎన్నో విధాల సహకరించారని గుర్తు చేశారు. పాత్రికేయులకు ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాత్రికేయుడు షఫీ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని తాను వ్యక్తిగతంగా ఆసుపత్రికి వెళ్లి యజమాన్యంతో మాట్లాడి



త్వరగా శస్త్ర చికిత్స జరిగేలా చూడడం జరిగిందన్నారు.ఆసుపత్రి బిల్లు ను కూడా సాధ్యమైనంత మేరకు తగ్గించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. షఫీ కుటుంబ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తాను రు.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. తాను కిందిస్థాయి నుండి ఎదిగిన వ్యక్తినని, పాత్రికేయుల సాధక బాధకాలు తనకు తెలుసునన్నారు. పాత్రికేయులకు ఎలాంటి సమస్య వచ్చినా వాటిని పరిష్కరించడంలో ముందుంటానని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశంతో మంత్రిగా ఎదిగానని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. జగిత్యాల ఎస్సీ హాస్టల్ విద్యార్థి హిమేష్ చంద్ర ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు గురి కాగా తాను వ్యక్తిగతంగా చొరవ తీసుకొని విద్యార్థి కుటుంబానికి ఒక్క పైసా కూడా ఖర్చు కాకుండా రూ. 18 లక్షలు ఆసుపత్రి బిల్లు తన మంత్రిత్వ శాఖ ద్వారా చెల్లించినట్లు తెలిపారు. షఫీ ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని ప్రత్యేక శ్రద్ధ చూపి ఆర్థిక సాయం అందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ కు పాత్రికేయుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ సీనియర్ పాత్రికేయులు పిఎస్ రంగారావు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చీటీ శ్రీనివాసరావు, బెజ్జంకి సంపూర్ణ చారి, జిల్లా యూనియన్ నాయకులు గడ్డల హరికృష్ణ, హైదర్, సిరిసిల్ల వేణుగోపాల్, నరేష్, రాజిరెడ్డి, పవిత్ర, సీనియర్ పాత్రికేయులు టీవీ సూర్యం, మల్లారెడ్డి, అంజయ్య, మదన్మోహన్, ప్రదీప్, వంశీ, రాజేష్, నారాయణరెడ్డి, మారుతి, లక్ష్మణ్, సామ మహేష్, సట్ట శ్రీనివాస్ ఫజల్, ఇక్రమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు.. “ఎస్సై గోపి”

**అక్షర కలం/ కారేపల్లి**



కారేపల్లి: సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని కారేపల్లి ఎస్ఐ గోపి ఓ ప్రకటనలో హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల పై శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఇతరుల మనో భావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు. ఏదైనా వర్గాన్ని కించపరిచేలా తెలియని సమాచారాన్ని పోస్ట్ చేయడం.. షేర్ చేయడం నేరంగా పరిగణించ బడుతుందని అన్నారు. ఏ గ్రూపులోనైె ఇలాంటి పోస్టులు షేర్ అయితే, ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణిస్తామని తెలిపారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. అనుచిత పోస్ట్ లు ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడతాయని పెర్కొన్నారు. సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచిని చేకూర్చే విధంగా మాత్రమే ఉపయోగించుకోవాలని, నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోపి పేర్కొన్నారు.

# ఈవ్ టీజింగ్ పట్ల అవగాహన కలిగి ఉండాలి ..-షి టీం ఏఎస్ఐ రాంరెడ్డి

**అక్షరకలం - నల్గొండ టౌన్**



నల్లగొండ షి టీం ఇన్స్పెక్టర్ కరుణాకర్ ఆదేశానుసారం శుక్రవారం ఉదయం పానగల్ సమీపంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో ఈవ్ టీజింగ్ పై షి టీం సిబ్బంది కౌన్సిలింగ్ నిర్వహించారు. షి.టీం ఏఎస్ఐ యాట రాంరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నరసింహ, ఉమెన్ హెచ్.సి. లక్ష్మీ, పాఠశాల హెడ్ మాస్టర్ యాదగిరి, తదితరులు ఈ కౌన్సెలింగ్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షిటీం ఏఎస్ఐ రాంరెడ్డి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల పట్ల ఏమరుపాటుగా ఉండడంతో పాటు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉద్బోధించారు. అత్యవసర పరిస్థితుల్లో షి టీం ను సంప్రదించాలని ఆయన తెలిపారు. బాల బాలికల తో పాటు మహిళల పరిరక్షణ కోసం ఆవిర్భావించిన షి టీం అన్ని వేళల మహిళల పరిరక్షణకు అండగా ఉంటుందని తెలిపారు.

# ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించిన అడిషనల్ డీసీపీ లా అర్డర్

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**



గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ సెంటర్ ను అదనపు డిసిపి (లా%డ%అర్డర్) ప్రసాద్ రావు సందర్శించారు. రఘునాధపాలెం, కోయచిలక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమావళి తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు.



# ఇల్లందులో ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు.

**ఇల్లందు /అక్షర కలం :**

ఇల్లందులోని కీన్ టైలర్ ఆవరణలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావుపూలే 135 వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్మి శెట్టి వీరన్న, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దళిత విమోచన సమితి రాష్ట్ర కార్యదర్శి బణాతి మోజేష్, ధర్మయ్య,కీన్ టైలర్ నాగేశ్వరరావు, టైలర్ భాస్కర్ తదితరులు అందరు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలదండలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జై భారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమిశెట్టి వీరన్న మాట్లాడుతూ భారతదేశ ఆధునిక యుగ వైతాళికుడు, అణగారిన వర్గాలను అగ్రవర్ణాల నుంచి కాపాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన కొనియాడారు. బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడడమే ప్రథమ కర్తవ్యం గా భావించి బహుజను



లందరిని ఐక్యపరచి వారిని చైతన్యపరిచి పోరాటం నడిపిన గొప్ప ధైర్యశాలి అని ఆయన అన్నారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించిన జ్యోతిరావు పూలే కు చిన్నప్పుడే తన తల్లి చనిపోవడం జరిగిందని ఆయన తెలిపారు. జ్యోతిరావు పూలేను బడికి పంపిస్తున్న తండ్రిని మత చాందసవాదులు బెదిరించి చదువును చదువును బంద్ చేయించారు. తండ్రికి స్నేహితులు బంధువులు ధైర్య వచనాలు చెప్పి పూలేను బడికి పోయేటట్టు చేశారని ఆయన తెలిపారు. అగ్రవర్ణాలకు సూద్రులు సేవ చేయాలె తప్ప పాఠశాలకు వెళ్ళరాదని ఆంక్షలు విధించారని తెలిపారు. అగ్రవర్ణాల మత చాందస్సు వాదుల కుట్రను గ్రహించిన జ్యోతిరావు పూలే వారికి వ్యతిరేకంగా కుల నిర్మూలనకు, స్త్రీల చదువుకు మనుషులంతా సమానమేనని పోరాటం చేశాడని అన్నారు. దేశ జనాభాలో స్త్రీలు సగభాగమైనప్పుడు వారు చదువుకుంటూనే దేశం అభివృద్ధి చెందుతుందని కుటుంబం అభివృద్ధి చెందుతుందని భావించి 18 48లో పాఠశాలను ఏర్పాటు చేశాడు, అంతేగాక 1858లో సైతం మరొక పాఠశాల ఏర్పాటు చేసి స్త్రీలను, పురుషులను తన పాఠశాలకు రప్పించి చదువుని బోధించాడు. బూర్జువా భూస్వాములు, అధికారులు అగ్రవర్ణాల వారు మతచాందసవాదులు ఎన్ని ఇబ్బందులు పెట్టినప్పటికీ ఎన్ని అవమానాలు పెట్టినప్పటికీ వాటినన్నిటిని భరించి సమాజాన్ని చైతన్యవంతం చేసి మహోన్నతుడు అయ్యాడని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, భాస్కర్,టి శ్రీనివాస్, అనతుల సింగ్,బనాతి మోజేష్,ధర్మయ్య, పాల్గొన్నారు.

# సమయానికి విలువనిచ్చి చదివితే అన్ని రంగాల్లో రాణింపు.. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**



సమయానికి విలువనిచ్చి చదివితే అన్ని రంగాల్లో రాణిస్తారని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినిలతో అన్నారు. ఉపాధ్యాయురాలు వలే జిల్లా కలెక్టర్ విద్యార్థినిలకు గణితం బోధించి మినీ క్లాక్ గూర్చి ప్రశ్నలు అడిగి జవాబులు చెప్పిన వారికి చాక్లెట్స్ పంపిణీ చేశారు. శుక్రవారం ఆమె మర్రిగూడ మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల ను ఆకస్మిఖంగా తనికి చేశారు. పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారని ? ప్రిన్సిపాల్ ను అడిగారు. విద్యార్థినిలతో మాట్లాడుతూ బాగా చదువుతున్నారా? రోజు పాఠశాలకు వస్తున్నారా? మీ పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయి? అని అడిగారు. కెజిబివి పాఠశాల శుభ్రంగా, చాలా బాగుందని కలెక్టర్ మెచ్చుకున్నారు. పాఠశాల మొత్తం తిరిగి వసతులు ఎలా ఉన్నాయని ? గదులు చాలా బాగున్నాయని అన్నారు. పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల సంఖ్యను పాఠశాల బోర్డు మీద చూసి తహసీల్దార్ తో విద్యార్థులు ఎందుకు రాలేదో తెలుసుకొని పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. విద్యార్థులకు ఆమె గణిత శాస్త్రం బోధిస్తూ దివ్య, ప్రణతి, కీర్తన అనే ముగ్గురు విద్యార్థులతో బోర్డుపై మినీ క్లాక్ డ్రాయింగ్ వేయించి విద్యార్థులనిలను ప్రశ్నలు అడిగారు. జవాబు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకొని సమయానికి విలువ ఎక్కువ ఇచ్చి చదువుకుంటే అన్ని రంగాలులో అభివృద్ధిలోకి వస్తారన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ప్రయోజకులు కావాలని చెప్పారు. చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ బి. శ్రీనివాస్, జ్యోతి ఉన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955